అభినవసరస్వతి

సంపుటము 33	వృషనామసంవత్సరము వైశాఖమాసము	సంచిక ౨

కృతివిమర్శనము

గీర్వాణవ్యాకరణసంగ్రహము.

ఏతద్గ్రంథకర్తలు నర్సారావుపేట మునిసిపల్ హైస్కూలు తెలుగుపండితులగు లంకా సీతారామశాస్త్రిగారు. ఈగ్రంథము ప్రభుత్వమువారు ప్రకటించిన ప్రణాళిక ననుసరించి సంస్కృతముచదువువారి కుపకరించులాగున శాస్త్రిగారిచే సమకూర్పఁబడినది. కనుక నిది సుపర్వవాగమృత సరోవరోహకులకు సోపానప్రాయము. ఇది యొక చిన్న సంస్కృతవ్యాకరణముగా సంస్కృతాభ్యాసకుల సౌకర్యార్థము పూర్వగ్రంథములనుండి పునరుద్ధృతము. ఇందు వర్ణసమామ్నాయాదులగు వలసిన సకలవిషయములును కౌముది ననుసరించి కనఁబఱుపఁబడినవి. కావున నీవ్యాకరణసంగ్రహము వ్యాకరణసిద్ధాంతముల కంటెను వివిధవిషయములను విశదముగా విదితముచేయఁగలుగుచు నభినవవిద్యార్థుల కత్యంతోపకారక మగుచున్నయది. ఇదివఱకుఁ జదువరు లుపయోగించుకొను శబ్దమంజరి తిఙంతమంజరులు నిదియే ఫక్కిలో నున్నను సరణి యింతసొంపుగాఁ జూపట్టదు. ఆరెంటి యందుఁగల విశేషములును నేతద్రాజమార్గమున నేగువారల కెంతయు సులభసాధ్యములు. ఆయావిశేషము లచ్చటచ్చట హూణలిపిచేఁ గూడ నుదాహరింపఁబడియుండుటచేఁ దద్భాషకు సహకారిగా సంస్కృతముఁ జదువునద్యతనవిద్యార్థుల కీవ్యాకరణసంగ్రహ మత్యంతోపయోగి కావున నాంగ్లేయవిద్యాపాఠశాలలలో నొక పాఠ్యగ్రంథముగాఁ బెట్టుటకుఁ బ్రభుత్వవిద్యాశాఖవారు ప్రయత్నింతురుగాక. దీని వెల 0-8-0. వలయువారు "శ్రీరామదూత, అందుకో, పబ్లిషర్సు, రామిరెడ్డిపేట, నర్సారావుపేట" అని వ్రాసికొనవలెను.

రామాశ్వమేధము.

పద్మపురాణాంతర్గత పాతాళఖండములోని శేషవాత్స్యాయనమునిసంవాదరూపమున నున్న రామాశ్వమేధమున కిది యాంధ్రీకరణము. చేసినవారు చింతలపాటి రామమూర్తిశాస్త్రిగారు. శాస్త్రిగారి మనోనైర్మల్యమున కీపుణ్యపురాణాంధ్రీకరణము వన్నెఁబెట్టినట్లయినది. విద్వత్కవియు గాయకుఁడును భక్తుఁడును నగు నీశాస్త్రిగారి కవిత్వము చక్కని ధారయు ధారకుఁదగిన గాంభీర్యము నర్థచమత్కృతియు భక్తిరసముఁ గలిగి రమణీయమై రాజిల్లెడిని. ద్రాక్షాపాకము. శబ్దాలంకారభూయిష్ఠము- ఈయంశములను దిగువపద్యములు ధ్రువపఱచెడిని.

సీ. సురసరి త్సితగరు త్కరివిభి త్తిమిరహ్యా
త్సమగాత్రి యేకంజవిమలనేత్రి
విలులిత సుమరస విచికిల కలవచః
కలనచే మించు నేకలభయాన
భవ రమాధవ శచీధవ ముఖ్య విబుధసం
స్తవనీయచరిత యేభువనమాత
చామరాంచత్కర సౌరనారీవార
సంసేవ్యమాన యేచంద్రవదన
ఆ పృథుశ్రోణి కలవాణి యజునిరాణి
అబ్దనిభవేణి నాజిహ్వ నధివసించి
ఇక్షు మాక్షిక ద్రాక్షా సదృక్షములగు
సుడులఁ బలికించుఁగాతఁ జేత్రముడి దలిర్ప. (ప్ర. ఆ. 3)

సీ. అఱువదివేలేడు లఖిలరాజన్యుల
నేలినాఁ డరులను దోలినాఁడు.
సంతతి లేకున్కిఁ జాలఁ గుంది తపంబు
చేసినాఁ డిలఁ బ్రీతిఁజేసినాఁడు.
పుత్రేష్టికై యిల్ల ముని ఋష్యశృంగుని
వేడినాఁ డాతని గూడినాఁడు.
ముపురుభార్యలతోడ మొనసి యాసవదీక్ష
పూనినాఁ డితరంబు మానినాఁడు (ద్వి. 45)

ఈగ్రంథము మూలగ్రంథాభిప్రాయము విడువకయుం మక్కికిమక్కి గాకయుఁ బెంచఁదగినచోటఁ బెంచియుఁ దుంచఁదగినచోటఁ దుంచియుఁ దెనిఁగించినట్లు తెలియనయ్యెడిని. చూడుఁడు.

సీ. పుటముదీరిన స్వర్ణపుం గణికలు కాదు.
వానికి నీమార్దవంబు గలదె?
విరహుల బాధించు మరుశరంబులు కాదు.
వానికిఁ జూడ నీవాసి కలదె?
నెఱిమించు నా తొలకరిమెఱుపులు కాదు.
వానికి నిల్కడపాటు గలదె?

మేలగు వజ్రింపుఁ గీలుబొమ్మలు కాదు
వానికిఁ జేతనభావ మున్నె?
అనుచు నిటు పూర్వపక్షసిద్ధాంతములను
చేయు యువకులఁ గని దరస్మేరచంద్రి
కలను దన్నేత్రకువలయములకుఁ గ్రొత్త
ఇంపుసేతురు వారపూర్ణేందుముఖులు. (ప్ర. 86)

ఇత్యాదులు. ఇవి పురాణమైన మూలగ్రంథమం దుండునవి కావుకనుకఁ బెంచఁబడినవి. ధారాశుద్ధిగల

సీ. అచ్చటఁ బదియూఱుహాయనంబులవాఁడు
బాలుఁ డొకండు నీవంటివాఁడు
పత్రిచిహ్నితముగు వాహంబు గని దాని
పట్టినాఁడ్వెలు కేలఁబట్టినాఁడు. (అష్టమ. 256)

మొదలగుపద్యము లెన్నియో యున్నయవి. ఇందుఁ బై పద్యపాదమందలి పట్టినాడ్వెలు విచారణీయము. అట్లే దుత్రాంతముగా వాడఁబడిన యేలయు. ఏత ద్గ్రంథనామమువలననే కథ తెలియనయ్యెడు. దీని వెల 2-0-0. కృష్ణాజిల్లా గుడివాడలో గ్రంథకర్తవద్దనే దొరకును.

శ్రీ రాఘవేంద్రవిజయము.

గ్రంథకర్త కవిశేఖర పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులుగారు. గుంటూరు హిందూకాలేజీ సంస్కృతాధ్యాపకులు. శ్రీరామకల్యాణాంధ్రకాదంబరీ శతలక్షణ్యాది గ్రంథరచనాధౌరేయులు. మధ్వమతస్థులు. మాధ్వపీఠాధ్యక్షులగు రాఘవేంద్రులను యతుల విజయమే యేతద్గ్రంథస్థవిషయము. పూర్ణప్రజ్ఞాచార్యులుగారి కవిత్వప్రాశస్త్యము పై కవిశేఖరబిరుదమే ప్రకటించెడిని. అవ్వారి యాంధ్రకాదంబర్యాదుల నభినవసరస్వతీపాఠకులనేకు లాస్వాదించియున్నవారలుకూడ. కనుక రాఘవేంద్రవిజయాపాదకములగు కొలఁది పద్యములుమాత్రము మచ్చున కుదాహరించి యుపరమించుచున్నవాఁడను.

మ. ధరణీపాలుఁ డొకండు బ్రాహ్మణుల క్షేత్రంబుల్ హరింపన్ మహీ
సురు లవ్వార్తను రాఘవేంద్రయతికిన్ శోకించుచుం జెప్ప స
త్వర మిప్పించెదఁ బొండు మీ రనుచు బేతాళున్ వడిం బిల్చి భూ
వరుపుత్రుం గొని దాఁచుమం చనఁగ నవ్వాఁ డట్టులే చేసినన్.

కం. తనయుఁడు కనఁబడఁడని విని
జనపతి వెదకంగ భృత్యజనములఁ బంపన్

చని వా రడిగిరి యూరఁ
కనఁబడెనె కుమారుఁడంచుఁ గనఁబడువారిఁ.

తే. గీ. కాలువలు బావులుం దటాకంబు లరసి
విపినములు మూలమూలలుఁ వెదకివెదకి
రాజనందనుఁ గానక రాజభటులు
నృపునితోఁ జెప్ప నతఁడు కన్నీరుపెట్టె.

ఉ. అన్నము దింటి. వింట మృదువౌ శయనంబున నుంటి. వింతలో
న న్నినుఁ బుత్ర! ఏరొ కరుణారహితుల్ గొనిపోయిరం చొగిఁ
కన్నుల నీరు కాలువలుగట్టఁగ నేడుచురాణిఁ గాంచి యా
సన్నజనుల్ వచించిరిటు. సాధ్వి! విచారముచేత నేమగుఁ !

తే. గీ. మహిమగలస్వాము లెవ్వరో మనదుపురికి
వచ్చినారంట. అట కేగి వారి పాద
పద్మములఁ బడ నేమేని ఫలము గలుగు.
అరయు నిది దివ్యదృష్టి నాగురుఁ డనంగ.

ఉ. భూపతి తత్క్షణంబ యతిపుంగవుచెంగట కేగి స్వామి! మా
పాపనిజాడ దెల్పుమని పాదములం బడ దేశికుం డనెఁ.
బాపల మాన్యముల్ గొనినపాప మదే యెడఁబాపె మిమ్ము మీ
పాపనితోడ. ఆయఘముఁ బాయుఁడు. పాపఁడు వచ్చు నింటికిఁ.

తే. గీ. అనుడుఁ బిలిపించి మరల నాయవనిసురుల,
నేరము క్షమింపుఁడీయని వారివారి
మాన్యముల వారి కిచ్చి నమస్కరించె.
రేయిఁ బ్రిక్కనె సుతుఁడు నిద్రించుచుండె.

దీని వెల 0–8–0. వలయువారు గ్రంథకర్త పేరనే గుంటూరుకు వ్రాయవలెను.

— ♦ జయంతి రామయ్యపంతులుగారు ♦ —

ఆంధ్రసాహిత్యపరిషత్ప్రతిష్ఠాపకులలో నొకరును నిరంతరవాఙ్మయసేవాధురంధరులును నగు శ్రీ జయంతి రామయ్యపంతులుగారు దివంగతులగుట మిక్కిలి సంతాపకరమగు విషయము. గిడుగు రామమూర్తిపంతులుగారి వ్యావహారికభాషావాదమును నిరసించుచు గ్రాంథికభాషోద్ధరణమునకై వీరు తమ జీవితసర్వస్వమును ధారపోసియున్నారు.వీరు

తూర్పుగోదావరిజిల్లా, అమలాపురముతాలూకా ముక్తీశ్వరగ్రామమున 18-7-1860 ని జన్మించిరి. 14 సం|| లవఱ కచ్చటనే ప్రాథమికవిద్యఁ జదివి యాంగ్లవిద్యాభ్యాసమునకై యన్న పేరయ్యశాస్త్రిగారి ప్రోత్సాహమున రాజమహేంద్రవరమునకుఁ జనిరి. 1882 నః బట్టపరీక్షయం దుత్తీర్ణులైరి. పీఠికాపురమున మహారాజావారి పాఠశాలయందు 84 వఱకుఁ బ్రధానోపాధ్యాయులుగా నుండి న్యాయవాదిపరీక్షకుఁ జదువుటకై మదరాసునకు వెళ్ళిరి. అట నుత్తీర్ణులై మదరాసుప్రభుత్వమువారి రివిన్యూశాఖయందుఁ బ్రవేశించి యచిరకాలముననే డిప్యూటీకలెక్టరై 1911 ప్రాంతమున 3 సం|| లు ప్రెసిడెన్సీమేజస్ట్రేటుపదవియు నటువెనుకఁ గొంచెదికాలము గుంటూరులో నసిష్టాంటు కలెక్టరుపదవియు నధిగమించి 1917 సం|| మొ. ఉపకారవేతనము నొందుచున్నారు. వీరు డిప్టీకలెక్టరుగా నుండినపుడు పెక్కుశాసనములకుఁ బ్రతిబింబములుతీయించి ప్రకటించి యుండిరి. చరిత్రలేఖనమున వీరు చతురులు. మదరాసునఁ బ్రెసిడెన్సీమేజస్ట్రేటుగా నుండినపుడే పిఠాపురము బొబ్బిలి వెంకటగిరి సంస్థానాధీశ్వరులఁ బ్రోత్సహించి యాంధ్రసాహిత్యపరిషత్తు నేర్పఱచిరి. మఱియు వీరు పీఠికాపురాధీశ్వరుల ధనసాహాయ్యమునఁ బెద్ద యాంధ్రనిఘంటువును రచింపఁజేసి ముద్రింపించుచున్నవారు. అందు 2 సంపుటములే వెడలియున్నవి. ఈమహోద్యమము పూర్తికాకుండనే శ్రీపంతులుగారు కీర్తిశేషులగుట సంతాపకరమగు విషయము. ఆంధ్రసాహిత్యపరిషత్ప్రతిష్ఠాపనము మొదలుగా వీరు కార్యనిర్వాహకసభ్యులుగా నుండి పరిషత్కార్యముల నతిదీక్షతో నిర్వహించుచును వివిధాముూల్యగ్రంథప్రకటన మొనర్చుచును సాంవత్సరికసభల జరుపుచును నతిదీక్షతో జీవితమును గడపియున్నారు.

వీరిప్రోత్సాహమువలననే యాంధ్రసాహిత్యపరిషత్తు భాషాసేవఁ జేయుచున్నది. ఇతోధికసేవఁ జేయించుచు నీసంస్థను సుస్థిరముఁ జేయఁదలఁచుచునే వీరు దేహమును విడిచిరి. కవులుగూడనై వీరు వివిధగ్రంథముల రచించిరి. ఉత్తరరామచరిత్రము చంపూరామాయణము నవరుకము సాంధ్రీకరించిరి. ఆధునికాంధ్రవాఙ్మయవికాసవైఖరియను గ్రంథమున నాధునిక రచయితల విమర్శించిరి. కేవల మాంధ్రసాహిత్యపరిషత్తునే కాక యాంధ్రు లందఱును భాషావిషయమునఁ బాటుపడవలసిన పద్ధతు లన్నియుఁ బ్రకటించి కృతకృత్యులైరి. వీరిది కౌశికగోత్రము. వెలనాటివైదికబ్రాహ్మణులు. నరసాపురనివాసులైన నుదురుపాటి లక్ష్మీనరసయ్యగారి పుత్రి లక్ష్మీదేవమ్మ వీరి భార్య. అదృష్టవంతురాలు. వీరి చెట్టఁబట్టినది మొదలు మిక్కిలి సుఖపడి వీరికంటె 6 నెలలు ముందుగా మూర్తి విడిచినది. ఈరామయ్యపంతులుగారు పిఠాపురమందలి యుపాధ్యాయత వదలుకొని బియెల్ చదువుకొనుట కాకాలమున రైలుమార్గములు లేకుంటచేఁ గాకినాడనుండి స్టీమరుపై మదరాసుకుఁ బోవుటలో జాఱిపడెనఁట. మునిఁగి తేలుచున్న వీరి జుట్టుపట్టి నావికులు పైకి లాగి బ్రదికించిరఁట. ఇప్పటివలె విద్యార్థులకు బోడితలలే యున్న వీరు నాఁడు జలగండము పాలై యుందురు. జుట్టే మహోపకారము చేసినది. మాతృదేశమున కింత మహోపకారము చేయవలసిన మహాపురుషుఁ డట్లేల యకాలమరణము నందును? వీరు కాకినాడ రసులుకొండ విశాఖపట్టణము నరసారావుపేట బళ్ళారి, అనంతపురము జమ్ములమడుగు

చంద్రగిరి మొదలగు చోట్ల డిప్యూటీకలెక్టరుపని న్యాయపథము దప్పకుండఁ జేసి గవర్నమెంటుయొక్కయుఁ బ్రజలయొక్కయు మెప్పును బడసిరి. ఆంధ్రసాహిత్యపరిష త్తేటేట సమావేశమగు గ్రామములలో సన్మానసంఘము పండితులకు భోజనసౌకర్యము కలిగించుచున్నను వీరు వేఱుగా బసచేసి సొంతడబ్బు ఖర్చుపెట్టి పండితులను స్వపంక్తికే పిలుచుకొనెడివారు. పండితగోష్ఠి వీరికి మిక్కిలి యిష్టము. సంతానములేనందున నన్నబిడ్డలనే కన్నబిడ్డలనుగా భావించి చివర కొక్కనిఁ బెంచుకొనిరి. ఆపిల్లఁడు భార్యకు దగ్గఱ బంధువు. పేరు బుచ్చిరామశర్మ. ఆదత్తున కన్న మునిమనుమరాలిని వివాహముచేసిరి.

31 సం॥ లు దొరతనమువారి కొలువుచేసి 1917 జులైలో మొదటితరగతి డిప్యూటీకలక్టరుగాఁ బెన్షన్ పుచ్చుకొని 24 సం॥ ల కీ ఫిబ్రవరిలో నీశ్వరునిలోఁ గలసిరి. వీరి జీవిత మెల్లవిధముల ధన్యమైనది. సంస్కృతాంధ్రాంగ్లేయద్రావిడకర్నాటక భాషలలో మంచి పండితులు. గొప్ప యుద్యోగములు చేసి విఖ్యాతివడసిరి. 80 ఏండ్లు జీవించిరి. ఇంతకంటె మనుష్యునకుఁ గావలసినదేమి? కనుకనే వీరిని జగమంతయు సంస్తుతించుచున్నది. విస్తరభీతి నందుఁ గొందఱి కొన్నిపద్యములు మాత్రము దిగువఁ దిలకింతురుగాక.

సీ॥ ఆంధ్రదేశమునందు నావిర్భవించిన
  మనుజమాత్రుఁడు నిన్ను మఱవఁగలఁడె?
ఆంధ్రసరస్వతి యడుగుల నంటిన
  మనుజమాత్రుఁడు నిన్ను మఱవఁగలఁడె?
ఆంధ్రశాసనములం దభిరుచి గల్గిన
  మనుజమాత్రుఁడు నిన్ను మఱవఁగలఁడె?
ఆంధ్రశబ్దార్థమ్ములం దిచ్ఛగలిగిన
  మనుజమాత్రుఁడు నిన్ను మఱవఁగలఁడె!
ఈవు మము వీడినంతనే యేము నిన్ను
మఱతుమే? ఆంధ్రుఁ డొకఁడైనఁ బరఁగునేని
నినుఁ దలఁచి యింట దీపంబు నిలుపు నిక్క
మేమి నీపుణ్యము జయంతి రామయార్య!

విశుపాటి విశ్వేశ్వరశాస్త్రి.

సీ. సముదాత్తమతి నాంధ్రసాహిత్యపరిషత్తుఁ
  గన్నబిడ్డంబోలెఁ గాచినాఁడు.
సంస్కృతాంధ్రాంగ్లభాషల లెస్స శోధించి
  పలువిశేషంబులు తెలిపినాఁడు.

కడు శ్రమంపడి ప్రాతపడిన శిలాశాస
    నమ్ములఁ బ్రకటంబొనర్చినాఁడు
గుప్తదానముల సంతృప్తులఁ గావించి
    విద్వత్కవుల గారవించినాఁడు.
భాసకై జీవితము ధారవోసినాఁడు.
ప్రభులచేఁ బ్రజచే మెప్పువడసినాఁడు.
చిరము మనినాఁడు. త్రిదివంబు చేరినాఁడు.
భవ్యశీలుండు రామయపండితుండు.

పండితారాధ్యుల నాగభూషణకవి.

సీ పలుకఁడు మితిమీఱి. పలికినం దల కొట్టు
    కొనిపోవుఁగాక, పల్కను నిజంబు.
ఈయఁ డెల్లరకు, నట్లిచ్చిన దేమాత్ర
    మేని పాత్రత మున్న యెంచి యిచ్చు.
కాంచఁ డన్యం బెది, కాంచిన నేవ్యవ
    హారమందేని న్యాయంబె తీర్చు.
వ్రాయఁ డెయ్యది వృథా, వ్రాసినతీర్పు ము
    ల్లోకంబు లేకమై తీర్పఁజాల.
వనెడు శాశ్వతకీర్తి మిన్నంది వెలుఁగ
లెక్కసేయు కెవ్వరిని గలెక్టరీనొ
నర్చె, ముప్పదియేండ్లు, పెన్షను గ్రహించె.
పలుకనౌనె రామయ్యపంతులు చరిత్ర?

చ ద్రవిడము కన్నడం బెఱిఁగి దైవతభాషఁ గలట్టి మర్మముల్
వివిధము లాకళించి కబళించి తెనుంగును హూణభాషయున్
ప్రవిమలరీతి నన్నిట నిరామయసాహితిగన్న మేటి నేఁ
డెవఁడుగలండు రామయబుధేంద్రుఁడుదక్క మఱొక్కఁ డెయ్యెడన్?

ఆ. వె. ముందు నీవో నేనో పందెమన్నట్టు ల
గ్గాంగలక్ష్మి పోయి యకట! నాల్గు
నెలలు గాకమున్నె యిలఁబాసి చనె రామ
యార్యుఁ డెట్టిధార్మికాగ్రసరుఁడో?

వెంపరాల సూర్యనారాయణశాస్త్రి.

—♦ ఆంధ్రబ్రాహ్మణ గోత్రరత్నాకరము ♦—

ఈగ్రంథ మచ్చులోనున్నది. ఋషిగోత్రములకు సంప్రదాయసిద్ధముగా సంబంధపడిన బ్రాహ్మణవంశములలో నేఁటికాలమునఁ జాలమంది తమ గోత్రముల నెఱుఁగనివారు నసలు గోత్రతత్త్వము తెలియనివారు నున్నారు.

ఋషికులసంజాతులమని గర్వింపఁదగిన హిందూసంఘమునఁ బుట్టి యందును బ్రాహ్మణవంశములలో జన్మించి చివరకు గోత్రవిచారముగూడ మఱచిపోయియుండుట మన దురదృష్టము. అట్టికళంకము తొలఁగింపఁగోరి యీగ్రంథమును సేకరింపఁబూనుకొంటిమి. స్వజాతిచరిత్ర తెలిసికొని స్వసంఘాభివృద్ధికై సర్వతోముఖకృషిజరుగుచున్న యీ కాలమున బ్రాహ్మణు లుపేక్షింపరాదు. ఈగ్రంథము విపులమగు పీఠికతోఁ గూడియున్నది. ఆపీఠిక గొప్ప పరిశోధనపై నాధారపడియున్నది. చారిత్రకులకును సనాతనధర్మపరులకును నందఱికిని మిక్కిలి యుపయోగకరము. పలువురు పండితులు ప్రశంసించిన మహాప్రయత్న మిది. మే నెల యాఖరులోఁగా ముద్రితగ్రంథము పంపఁబడును.

రాజపోషకులకు	రు. 5–0–0
పోషకులకు	2–0–0
సహాయులకు	1–0–0
చందాదారులకు	0–8–0

వలయువారు, బిదురు నాగయ్యశర్మ, సుద్దపల్లి, వేజండ్లపోష్టు, గుంటూరుజిల్లా, అని వ్రాసికొనవలెను.

ఆర్యవర్యులకు నమస్కారములు.

ఈగ్రంథములో నాంధ్రబ్రాహ్మణుల గోత్రములు ప్రవరలవివరములు ఋషిసంప్రదాయములు మున్నగువానితోపా టిండ్లపేరులు మొదలగునవి విశదముగాఁ జేర్పఁబడినవి. గోత్రతత్త్వ మీనాఁటివారి కెఱుకపఱచుటయే గ్రంథముయొక్క ముఖ్యోద్దేశము గావున నిప్పటి యభిరుచులను బట్టి యుపోద్ఘాతము వ్రాయవలసియున్నది. ఆసందర్భమునఁ గొన్ని సందేహముల వ్రాసికొనుచున్నాను. వానిని జాగ్రత్తగాఁ బరిశీలించి దయతో సమాధానము పంపఁగలిగినచో నుపోద్ఘాతమునఁ బ్రచురించెదను. తెలియనివారికిఁ దెలియఁజెప్పుటకుఁ బండితులకంటె నితరు లర్హులు కారు. కావున నాప్రార్థన నంగీకరించి మన్నింపఁగలరని యాశించుచున్నాను.

ఇట్లు విధేయుఁడు,
బిదురు నాగయ్యశర్మ.

1 గోత్రము లెన్ని?
2 గోత్రమనఁగా నేమి?
3 గోత్రములకు ఋషులకు సంబంధ మేమి?
4 గోత్రవిధాన మెట్టిది?
5 గోత్రతత్త్వము హిందూమతములో నొకభాగమగుటకుఁ గారణమేమి?

6 గోత్రచరిత్ర వేదమతమున నెప్పటినుండి ప్రారబ్ధము?
7 గోత్రములలో ఋషులు భిన్నభిన్నసంఖ్యలతో నుండుటకు హేతువేమి?
8 గోత్రవిధానము ననుసరించవలసినది వివాహాదులనేనా? ఇతరవిషయములలో నెచ్చటనైన నున్నదా?
9 గోత్రమునకుఁ బ్రవరకు సంబంధ మేమి?
10 వివాహసందర్భమున భిన్నభిన్నగోత్రజులకే యేల పొందిక యేర్పడవలయును? అట్లయినచోఁ గృష్ణుఁడు పురోహితభేద మున్నంతమాత్రమున సత్యభామను బెండ్లాడవచ్చునా?
11 ఋషులే బ్రాహ్మణులకు గోత్రప్రవర్తకులగుటకును బురోహితులే క్షత్రియ వైశ్యులకు గోత్రప్రవర్తకు లగుటకును గారణ మేమి?

—♦ జ్యోతిర్గత ♦—

(దైవజ్ఞరత్న చింతలపాటి సుందరరామశాస్త్రిగారు)

18—5—1941 వఱకుఁ దీవ్రమగు నెండలుఁ బశ్చిమవాతాధిక్యము దేశమున విశేషమగు కలహములు నష్టలు గొప్పగొప్ప మార్పులు జరుగుట కవకాశము కలదు. 19 మొ. 27, 28 వఱకు గాలిదుమారములు నుష్ణాధిక్యముచే జనులకు జంతువులకు బాధయుం రాజతంత్రములోఁ గొన్ని మార్పులు జరుగవచ్చును. 28 మొ. 31 వఱకుఁ బశ్చిమవాతాధిక్యము ఖండవృష్టి జనులలో నకస్మాద్రోగబాధ. 1—6—41 మొ. 3 వఱకు వర్షప్రతిబంధము. కొన్నిప్రదేశములలో నధికవర్షములు. 4 మొ. 6 వఱకుఁ బశ్చిమవాతోద్రేకమునఁ బ్రపంచమున నష్టి, ఉడుకు. ఆకసము మేఘావృతమై వర్షము కురియుట కారంభించును గాని యసంతుష్టిగా నుండును. 7 మొ. 16 వఱకు నన్ని చోట్లలోను బీజావాపానుకూలవర్షము గురియును.

ఈనెల 18 వఱకు భయంకరమగు చర్యలు జరుగును. భూకంపాదులుగాని యన్యోన్యకలహోద్రేకములుగాని కలుగును. 23, 24, 26, 28 తేదీలలో నెక్కువ మార్పులు జరుగునని తోఁచుచున్నది. పశుపీడయుఁ నుపద్రవాధిక్యముఁ గల్గును. 29 మొ. జూన్ 7 వఱకుఁ బశ్చిమవాతోద్రేకము. రాజులు మిత్రభావముగాని యుదాసీనతగాని పొందుదురుకాని కలహ ముద్రేకించియే యుండును. 8 మొ. 15 వఱకు పర్వులకు నన్నివిధముల సౌఖ్యముగానే యుండునుగాని మంచికాలమని నమ్ముటకు వీలుండదని తోఁచును. 5—6—41 వఱకు ధాన్యాదులకుఁ బురుగు. ఎలుకలమూలమున నరిష్టము. 21—5—41 మొ. 29 వఱకు నువ్వులు ప్రత్తి నూలు వేరుసెనగలకు ధర. వర్షములకు వాయువుమూలమునఁ బ్రతిబంధము. బండ్లరాకపోకలుగూడ నాఁగిపోవును. ఉష్ణోద్రేకమునఁ జిత్రవిచిత్రవ్యాధులు ప్రబలును. 30—5—41 మొ. 15—6—41 వఱకుఁ గలహములు తగ్గకుండును. పరదేశీయుల బాధ భారతీయుల కెక్కుడు నష్టిదాయకమగు నవి తోఁచును.

విజ్ఞాపనము.

విజయవాడలో మార్చి 29, 30 జరిగిన యాంధ్ర దేశీయ పత్రికాసంపాదకుల మహాసభలో జరిపిన తీర్మానము:—

తిరుపతి పట్టణమున నెలకొల్పఁబడియున్న శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిషత్తువారు రచింపఁబూనుకొన్న "ఆంధ్ర సాహిత్య విజ్ఞాన సర్వస్వము" న కాంధ్రదేశీయ పత్రికా సంపాదకులు తమయెఱుకలోఁగల యాంధ్ర కవులయొక్కయు, రచయితలయొక్కయుం జీవిత సంగ్రహములను వారు రచించిన గ్రంథముల పట్టికను (ముద్రితాముద్రితములు) తిరుపతి 'కాంతి' పత్రికా సంపాదకుని ద్వారమునఁ బరిషదధిపతియగు డైరెక్టరుగారికిఁ బంపి తోడ్పడునట్లు కోరుటయయినది.

కవులును బండితులును దగు సహకారమొసఁగి, వలయు వివరములను వెంటనే పంపఁ బ్రార్థితులు.

పి. టి. జగన్నాథరావు
సహాయకార్యదర్శి.

—• హంపీశిథిలములు •—

(యన్. కే. వెంకటేశముగారు)

హొసపేటవద్ద రైలు దిగినతోడనే జంబునాథపర్వత మగపడును. ఊరిలోనుండి మూఁడుమైళ్లదూరము పోయినచో నాకొండక్రిందికిఁ బోవుదుము... దాదాపుగఁ బదినిమిషములు కొండపై కెక్కిపోవలయు. అప్పుడు మన మొక సొగసైన చఱియలోఁ బ్రవేశింతుము. అచ్చటనుండి క్రిందికిఁ జూచినయెడల హొసపేటపట్టణ మంతయుఁ జక్కఁగ నగపడును. పైకి దృష్టిమరల్చినచో దట్టమైన పెద్ద చెట్లసమూహము చూడఁగలము. వీని మధ్యమునఁ జదరమైన నేలపై...జంబునాథదేవాలయము గలదు. అచ్చటనుండు పూజారి యొక లింగాయితుఁడు. దేవాలయముచెంతనే యొక చిన్న మంచినీటిబావి గలదు. దీనికిఁ గ్రౌంచతీర్థమని పేరు. ఆబావిలో స్నానమొనర్చి పరిసరములఁ జూచుటకు మిగుల మనోహరముగ నుండును. ఈకొండ హొసపేట కొకప్రక్క నున్నది. మఱియొకప్రక్క హంపికిఁబోయెడి బాట. హంపికిఁబోవునపు డూడగమిటీ దాఁటకమునుపే యనంతశయనాలయము దృష్టిగోచరమగును. ఇది హంపి దక్షిణపుటెల్ల యనవచ్చును. ఈదేవాలయము నందు గమనింపవలసిన విషయములలోఁ బొడుగై విశాలముగ నుండు దాని శిఖరమును గర్భగుడికి ముంగటివైపున నుండు విశాలమైన ముంగిలియు. ఈరెండు...ను సాధారణముగ హిందూదేవాలయములకు సహజములు గావు. శిల్పకళానిపుణత...గఁ గాన్పించును. దేవాలయములోని యితరగోపురములుఁ దక్కిన నిర్మాణములుఁ దక్కిన హిందూదేవాలయములలోవలెనే యున్నవి. ఈదేవాలయము చాలమట్టుకు శిథిలీభూతమై యున్నది. ఐనను బ్రభుత్వమువారిచే రక్షింపఁబడుచున్నది. చుట్టుప్రక్కలనుండు పాడుపడిన నిర్మాణముల వలన నొకానొకప్పు డిది యొక గొప్పదేవాలయమై యుండినట్లు చూపట్టెడిని. అనంతశయనము భరతవర్ష...మునకు దక్షిణపుటెల్లయగునట్లు విజయనగరపు దక్కినసరిహ

ద్దనంతశయనదేవాలయము. అనంతశయనాలయంబునకుఁ గొంతదూరమున నుత్తరపుదిశ యందు మల్లికార్జునాలయము గలదు. ఆదేవాలయముసమీపమునఁ ద్రోవ కిరుప్రక్కల నుండు నొకటిరెండుదేవాలయములు మండపములు నూతులు మొదలైనవానిని బట్టి యాకాలమున నిది యొక ప్రసిద్ధమైన నిధియై యుండవచ్చుననియు ననేకయాత్రికులు మహావైభవముతో జరుగుచుండిన వార్షికోత్సవమునకు వచ్చిపోవుచుండి రనియుఁ దెలిసి కొనఁగలము...శ్రీశైలమువలె నిది యొక చిన్నశ్రీశైలమనవచ్చును. అనంతశయన మల్లికార్జునదేవాలయముల దాఁటి... కొంతదూరము...పోఁగా...పాడుపడిన గోపురములు మార్గముల కిరుప్రక్కలఁ గాన్పించును ..మఱి...కొంతదూరము పోఁగాఁ గొన్ని... మసీదు లగపడు. అవి నవీనములయిన నిర్మాణములుగఁ జూపట్టెడిని. అంతకుఁదప్ప నీత్రోవలో నేమియుఁ జూడఁదగిన యంశములు లేవు.

కమలాపురసమీపమున నొక చెఱువు గలదు. అచ్చటనే యొక పాడుపడిన చిన్న కోట గలదు. ఇది విజయనగరరాజుల సంరక్షకసైన్యనివేశనమై యుండవచ్చును. ప్రయాణికులు విశ్రమించుటకుఁ గమలాపురము మంచి మెట్టు ..వాయవ్యమూలగ నొక రస్తా పాడుపడిన పట్టణమునుండి హంపికిఁ జేర్చును ... కోటగోడ దాఁటిపో...రాణి జలక్రీడాభవనముచోటికి వత్తుము. ఇది యొక చిన్న కోనేరు. దానిచుట్టు నొక సొగసైన నిర్మాణము గలదు. నీరు కోనేరులోనికి వచ్చుటకును వెడలిపోవుటకును జిన్న కాలువ గలదు. దీనికిఁ దూర్పున నొక యవుతుఖానా. దానికిం దూర్పునఁ జంద్రశేఖరదేవాలయము. ఈ పాడుపడిన నిర్మాణములకు వాయవ్యమూలను నీరు నింపియుంచెడి యొక పెద్ద తొట్టి. దీని సమీపముననే స్నానమున కుపయోగించెడి యెనిమిదికోణములుగల చక్కనిప్రాసాద మొకటి. ఈవింతనిర్మాణము లన్నియుఁ గోట దక్షిణప్రాంగణమునం దుండుటచే నీ స్థలము స్నానపానీయాదికృత్యముల కుపయోగింపఁబడుచుండెనని యూహింపనగు. ఈస్థలమునకు సమీపముననే పెద్ద కోనేరు. దాని యధోభాగ మంతయు శిలామయంబు,..రాతి గొట్టపుఁ గాల్వల సముదాయము చాలదూరము వ్యాపించి యాకాలమున నచ్చటి యన్ని కోనేళ్లకు నీరు నింపుచుండెను. ఈసముదాయము శిల్పకళాకౌశలమునకు నిధానమగుటచె ...మిగుల శ్లాఘాపాత్రమై యున్నది. దానిని గట్టుట కెంతమంది...పట్టియుండవలయునో యది యెంతజనోపయోగముగ నుండియుండవలయునో యను విషయము మన మాశిథిలముల పంచ నిలుచుండి యించుక ధ్యానించినచోఁ గరతలామలక మగును.

కోట శిథిలములలో మధ్యభాగమున మహానవమి దిబ్బయను సొగసైన నిర్మాణ మొకటి. ఇప్పు డిది యొక యెత్తైన యరుఁగువలె నున్నది. పైకప్పు పోయినది. ఇది మిగుల నున్నతమై చెక్కడపు రాళ్లచేఁ గట్టఁబడి యున్నది. దీని గోడలపైన మలిచియుండు నానావిధప్రతిమలు,. మొదలైనవానిని జూచినపుడు . మహానవమినాఁడు విజయనగర సార్వభౌముఁ డచ్చటఁ గూర్చుండి నగరవాస్తవ్యులకు దర్శనమిచ్చుచుండినపు డెట్టి శోభాయమానుఁడుగ నుండెనోయను విషయము నాలోచించినపుడు దుఃఖనిమగ్నుఁడు కానిమానవుఁ డుండఁడు...సకలచరాచరసృష్టికర్త్రియగు మహాశక్తి...దానవుల...నుక్కడంచి సామ్రాజ్యాభిషిక్తురాలైన దినమే యీమహానవమి. ఈదిబ్బకుఁ బశ్చిమమున రాజగృహము...దీనిసమీపముననే పశువులకు నీరుంచియుంచెడి యొక రాతితొట్టి. రాజ

గృహమున కావలివైపు భూమ్యంతర్భాగమునఁ గార్యాలోచనభవన మొకటి. ఇది రహ
స్యాలోచనల కుపయోగింపఁబడుచుండెనుగాఁబోలు ! దీని కావల రాజు మంత్రా
లోచనసౌధ మొకటి...ఎంతజన మచ్చట సమావేశమగుచుండినదియుఁ దెలిసికొనుటకు
దాని యధోభాగముమాత్రమే మిగిలియున్నది...దీనికి నైరృతిమూలఁ దంకశాల...
ఈప్రాకారములోపల మసీదు. ఇది చాలమట్టుకు నవీనభవనము. దీనివెంటనే నౌబతు
నగారా వాయించెడి...గోపుర మొకటి...ఉత్తరదిశయందు రక్షకభటులు కాచియుండెడి
బురుజొకటి...ఈప్రాకారము దాఁటి తూర్పుదిశకుఁ బోయినచో హజారరామస్వామి
దేవాలయము నగరసింహద్వారమం దున్నది. మనుష్యున కెంతశిల్పకళ సాధ్యమగునో
యది యందు వ్యయముచేయఁబడినది. రాజశ్రేష్ఠుఁడును మహావీరుఁడును నగు శ్రీరామున
కిది తగిన నెలవనవచ్చును. దేవాలయము చుట్టు ప్రాకారపుగోడలమీఁదనుండు నద్వితీ
యములగు నానావిధచిత్రపటములు వర్ణింప...తరముగాదు. రామాయణవృత్తాంత
మంతయుఁ బ్రతిమల రూపమునఁ జూపఁబడియున్నది. ఈదేవాలయము ముందటఁ బాడు
పడిన తేరుబజారు...దేవాలయము రాజభవనమునకు నంతఃపురమునకు మధ్యనున్నది...
ఈప్రాకారమునకుఁ దూర్పుభాగమున నేనుఁగులాయము లున్నవి. ఇవి గోపురములు
గలిగి మిగుల నందముగఁ దనరారు.. కోటశిథిలములు దాఁటిపోవునపుడు కడపట మన
కగపడున దొక భూమ్యంతర్భాగపు దేవాలయము...ఇది మిగుల సుందరమైన దేవాల
యము. అపాయకరమగు దినములలో రాజవంశమువారు రహస్యముగఁ బూజచేయు
దేవాలయమై యుండియుండవచ్చును. ఈదేవాలయముతో విజయనగర...శిథిలములఁ
దాఁటి వాయవ్యమూలగఁ బోయి పంపాక్షేత్రము చేరుదుము.

...ప్రవేశించునపుడు వీరభద్రుని దేవాలయము చూతుము. శివావతారుఁడైన
వీరభద్రుఁడు క్షేత్రమును గాపాడుటకు...ద్వారమున నున్నాఁడు...మనమిపుడు తుంగ
భద్రనుండి తీయఁబడిన కాలువను దాఁటిపోవుదుము. అచ్చట...గొప్ప నృసింహవిగ్ర
హము గలదు. నృసింహుఁడు విజయనగరవంశీయుల యిలవేల్పుగఁ గన్పట్టెడిని. ఈవిగ్ర
హము ప్రక్కనే యొక గొప్ప జలావృతంబగు శివలింగము గలదు. సమీపముననుండు
కృష్ణదేవాలయము దాఁటినచోఁ బంపాక్షేత్రమునఁ బడెదము. ఈదేవాలయము మిగుల
రమ్యము...హాసపేటనుండి హంపికి వచ్చు రెండుబాటలు నిచ్చటనే కలియు. త్రోవకుఁ
బశ్చిమమున...గణేశువిగ్రహము తెల్లరాతియందు మలుచఁబడియున్నది. తూర్పుప్రక్క
నంతకంటెఁ బెద్ద...గణేశువిగ్రహము నల్లరాతిలోఁ జెక్కఁబడియున్నది...సర్వవిఘ్న
వినాయకుఁడును సర్వకార్యసిద్ధిప్రదుఁడును నగు గణేశుని విగ్రహముల మధ్య వెడలి
పోఁగా హేమకూటపర్వతాగ్రమునకుఁ బోవుదుము. అచ్చటను బంపాక్షేత్ర విద్యా
నగరముల శిథిలములు బాగుగఁ జూడవచ్చును. ఈకొండ వంపునందుండు నాలయము
లలో విశ్వనాథాలయమునందుమాత్రమే పూజ జరుగునది. ఇచ్చటనుండు దేవాలయముల
గమనించినయెడల వారణాసికిఁ బ్రతిరూపముగ నేర్పఱుపఁబడినట్లు చూపట్టెడిని. ఇవన్ని
యును బంపాక్షేత్రమున కుత్తరపుఁగొన నున్నవి...

పర్వతపుఁ దూర్పుభాగమున...క్షేత్రమున కధిష్ఠానదేవతయగు పంపాపతి గోపు
రము. ముందట... పాడుపడినప్పటికి విశాలమైన సొగసైన వీధి. దేవాలయమువద్దనుండి

కొన్నియిండ్లుమాత్రమే సాధారణమైన ఋతువులం దుపయోగింపఁబడుచుండును. ఇతర సమయములందుఁ బూర్తిగా విఱిగిపోయినట్టియు సగము పడిపోయినట్టియు భవనములు గలిగి యీ, బజారు నిర్జీవకళ గొట్టుచుండును.

కొన్నిమాత్ర మచ్చటచ్చట మరమ్మతు చేయఁబడుచున్నవి కాని తక్కిన వన్నియుఁ బ్రకృతిరాజ్యమున కెరయయినవి. రమ్యమగు గోపురమును దాఁటి లోపలికిఁ బో నొక బయలుప్రదేశము చేరుదుము. ఇచ్చట యాత్రికుల యుపయోగార్థ మొక రాతిసీటికాలువ గలదు. యాత్రికులు ముసాఫరులు నిచ్చటనుండు గదులఁ దీసికొనెదరు. సర్వదా నివసించు వారెవరును హంపిలో లేరు...దేవాలయపు నవుకరులును యాత్రికులును నెప్పుడు నుందురు. ఉత్సవదినములలో ననేకులు వచ్చుచుండెదరు. కాని వారు వచ్చుచుఁ బోవుచు నుండువారు ఆస్థల మంతయుం నిర్జనమై పరశివుఁ డిట్టిప్రదేశమునుగదా తపస్సునకుఁ గోరుకొనినది యనేకవత్సరములక్రిందననియుం లోకమాతయగు భువనేశ్వరి యిచ్చటనేకదా తపస్సుచేయుచుండినదనియుఁ బవిత్రులగు మహర్షిగణంబులు సమాధియం దుండినది యనియు వానరులు...స్వేచ్ఛావిహారములకుఁ గోరుకొనినది యనియుఁ దలంపులు మన మనంబుల స్ఫురింపఁజేయును. రెండవప్రాకారములోనికిఁ బోయినచో శ్రీ విరూపాక్షేశ్వరుని మండప మగుపడును...మండపముల చుట్టును గోపురములమీఁద నానావిధ చిత్రప్రతిమ లున్నవి కాని వానిపై సున్నముగొట్టుటచే విరూపమును బొందినవి. అనేకపురాణేతిహాసములలోని యంశములు ప్రతిమారూపమున నున్నవి. మధ్యనుండు కల్యాణమండపము విరూపాక్షేశ్వరుని యుత్సవమున కుపయోగించెదరు. లోపలనుండు లింగమును హిందువులైనవా రందఱును బూజచేయవచ్చును. ఇచ్చట గోడలమీఁదను స్తంభములమీఁదను నుండు ప్రతిమలు...కృష్ణదేవరాయలచేతనే కట్టఁబడినవని యూహింపవచ్చును.

ఆన్నిస్థలములలోను నృసింహ ప్రతిమను మిక్కుటముగఁజూడఁగలము. శివుని గర్భాగారమున కుత్తరమున వేఱొక ప్రత్యేకమంటపమునందు...పార్వతి యున్నది...ఇచ్చటనే మఱియొక గుడియందు దక్షిణపుదిక్కు దిరిగి తపస్సుఁజేయుచుండెడి యాది శక్తియగు భువనేశ్వరి ప్రతిమ గలదు...ఋషులును...విద్యారణ్యస్వామియు నీమె ముంగలఁ గూర్చుండియే తపస్సుఁజేసినది. రాతియందు నానావిధోద్భిజ్జములచేతను ద్వారబంధముమీఁద...శ్రీమహాలక్ష్మి ప్రతిమచేతను రాజిల్లు నా చిత్రప్రదర్శనము హిందూశిల్పకుని యద్వితీయసామర్థ్యంబునకుఁ దార్కాణము. చిత్రకారునికి...స్వేచ్ఛ యిచ్చిన నాతని ప్రజ్ఞ యెట్టియున్నతస్థానము నధిష్ఠించఁగలదో మన మీచోటఁ జూచి తెలిసికొనఁగలము. ఈదేవి పైవైపు కప్పుమీఁదఁ బురాణోక్తానుసరణముగ నవగ్రహ చక్రము చెక్కఁబడియున్నది. ఇదిగూడ హిందూశిల్పకళ కుదాహరణమే. పంపా క్షేత్ర మంతటిలో...భువనేశ్వరిపూజ మిగులఁ బుణ్యవంతమైనది.

దేవాలయము నుత్తరద్వారమునుండి పోఁగా ననేకమైన చిన్నదేవాలయములు. అవి శివుఁడు దత్తాత్రేయుఁడు మొదలైనవారి ...వి... దేవాలయపుఁ గోనేటితీరము నుండి పోఁగా...తుంగభద్ర...ఆస్థలమంతయు ననేకమైన గుళ్లు గోపురములతో నిండి యుండు...వర్ణింపఁదరముగాదు. అయితే మానవకళాకౌశలము ప్రకృతిపై వ్యర్థపుచ్చుఁ

బడినదనిమాత్రము తెల్లమగును. నదిలో నచ్చటచ్చటఁ బడిపోయిన మండపములు నందులు మొదలగువానిని జూడవచ్చును. నది దక్షిణపుగట్టువెంబడి విజయనగరపు వెలుపలికోటగోడ చాలదూరము వ్యాపించియున్నది.

ఒడ్డున వేనవేలయేండ్లనుండియు...స్వేచ్ఛగఁ బెరిఁగి విమలసలిలములఁ ద్రావి మదించి యంతకన్న వేయిరెట్లెక్కుడు మదవంతములుగఁ జేయఁబడిన వేళ్లుగలవై తన రాయ నంబరచుంబి ... వటవృక్షముల సఖ్యతఁ బడయుటకోయన్న ట్లనేకశిథిలాలయములు వానితో సమ్మిశ్రితములైన యోతప్రోతములవలె నున్నవి. ఆనదిలో స్నానము... మిగుల మనోహరముగ నుండును. సలిలముల చల్లదనము లోకవిదితము...ఇచ్చటనుండు నైసర్గికవైచిత్ర్యము తానుజూచిననే తెలియును. నది యంతటను నిక్కపొడుచుకొని యున్న పెద్ద శిలలచేనేమి, రాక్షసుల నవఘళించి యంబరచుంబితములై యెట్టిని యెండలో నిలిచియుండు మహావృక్షసముదాయముతో నేమి,...విశుద్ధజలములః మహాప్రవాహముతో నేమి, యీప్రదేశము సృష్టివైచిత్ర్యకు ... నిధానమనుటకన్న నెక్కుడు వర్ణింప నలవిగాదు. వేదాంతులు చెప్పునట్లుగ నొకఁ డచ్చట నిలుచుండినపుడా యనంత ప్రకృతిముందటఁ దా నొక పరమాణువులలోని పరమాణువునకు సరిపోవుటలేదని తలంచక మానఁడు...పరబ్రహ్మాంశుండగు నాదిత్యుఁడు పైనను మన యధ్యాత్మప్రకృతి నంతటిని దరింపఁజేయఁగల సృష్టివైచిత్ర్యము క్రిందను గల యీపుణ్యప్రదేశమునకన్న నిరాటంకముగ దేవఋషిపితరుల కర్ఘ్యమొనర్చి నిత్యకర్మానుష్ఠానము లొనర్చుటకు రమణీయంబగు విజనప్రదేశము వేఱొకటి యుండదు నాయభిప్రాయమునందు. ఈచోటు ప్రతి హిందువునకు హృదయరంజకంబుగ నుండితీఱవలయు...

...సజీవముగ నుండునది యీస్థల మొకటియే. వేదభాష్యకర్తయగు విద్యార(ణ్యుఁడాదిగాఁగల) మహామహులచే దీవింపఁబడి శ్రీవిరూపాక్షేశ్వరుని సామ్రాజ్యము క్రిందనుండు పంపాక్షేత్ర మిదియే. కృష్ణరాయభూపాలుని కాలమున నద్భుతమగు రాజవీథియై యిపుడు మసుగుపట్టు చెలమవలె నుండు తేరుబజాఱునుండి పోవుదము. మన కిరుప్రక్కల నగుపడెడి మంటపము లానాఁటి దివ్యభవనముల పురోభాగములై యుండవచ్చును. తిరునాళ్లసమయమునఁ దేరుబజాఱు జనసమూహముతో నిండియుండు నపుడు స్త్రీలు శిశువులుఁ గూర్చుండి యుత్సవాదుల వీక్షించు స్థలములై యుండవచ్చును. ఈపొడవైన తేరుబజాఱు కడపటఁబరుండియుండిన ట్లుండెడి యొక పెద్దనంది యున్నది. ఈనంది యొకగొప్పశిలయొక్కయుపరిభాగమునఁ జెక్కఁబడియున్నది...మనోహరము... మతంగమహర్షి యావాసంబగు మతంగాద్రికిఁ గొనిపోయెడి సోపానమార్గ మొండుగలదు. ఈపర్వతమును మనము కుడివైపున విడిచి...నందికిఁ గుడిప్రక్క కాలిత్రోవను బోయిన యెడలఁ బంపాక్షేత్రసంబంధమైన మఱికొన్ని శిథిలములఁ జూతుము. కాలిత్రోవ తుంగభద్రవెంటనే పోవుచుండును. మొదట నగుపడునది కోదండరామస్వామిదేవాలయము. ఇచ్చట సీతాసమేతులగు రామలక్ష్మణుల విగ్రహము లొకశిలయందు మలఁచఁబడిన...వి. సుగ్రీవుని ప్రార్థన ననుసరించి యయోధ్యకు మరలివెళ్లునపుడు కిష్కింధావాసులకు దర్శనమిచ్చుటకై యచ్చట వెలసెనట...ఈదేవాలయము రామాయణములోఁ జెప్పఁబడిన వృత్తాంతమునకు జ్ఞాపకచిహ్నమగుటచేఁ బవిత్రీభూతమయ్యె. దేవాలయము

ముందఱ నదిలోఁ గొంతదూరమునఁ జక్రతీర్థము. ఈదేవాలయము ముందఱివైపున నిలుచుండిన ఋశ్యమూకమును నంజనాద్రిని జక్కఁగఁ జూడఁగలము. ఈదేవాలయము ముందఱనే సూర్యనారాయణాలయము...ఇచ్చటనే యాంజనేయదేవాలయము. ఇచ్చట మధ్వాచార్యప్రతిమ...ఈరూపమున మధ్వుల కత్యంతాదరము.

ఇచ్చటనుండి తూర్పున కించుక పోయిన...మరల శిథిలము లారంభమగును. వరాహానంతశయనదేవాలయముల వలన విష్ణుక్షేత్ర మేర్పఱుప యత్నము సల్పఁబడినట్లు చూపట్టెడిని. శేషతల్పముపై యుండు శ్రీమహావిష్ణు పాదముల కిరుప్రక్కల శ్రీదేవి భూదేవి యుపచారము చేయుచుండ నాభియందుఁ గమలసంభవుఁ డుద్భవమొందినట్లు చిత్రింపఁబడిన యీదేవాలయములోని విగ్రహము మిగుల శ్లాఘాపాత్రమైనది. కొంచెము చుట్టుతిరిగి పోయినచోఁ బడిపోయిన మండపముల చాలునుండి యచ్యుతనారాయణ దేవాలయము చేరుదుము. ఈదేవాలయము శిథిలమైనను మిగిలియుండు మంటపములు గోపురములు శిల్పకళాకౌశలమును దెలియఁజేయుచున్నవి. ఈదేవాలయమును...అచ్యుతరాయలు కట్టించిరఁట. ఈరాజన్యుఁడు శివక్షేత్రమగు పంపాక్షేత్రమువంటి విష్ణుక్షేత్ర మొకటి యొనర్ప యత్నించిన ట్లగుపడెడిని. దేవాలయమునకు ముందఱివైపునఁ బాడుపడి నామమాత్రావశిష్టముగ నుండు తేరుబజారుఁ బంపాక్షేత్రములోని తేరువీథివలె నిర్మింప యత్నించిన ట్లగుపడెడిని...ఇది వారకాంతల వీథియని చెప్పుట విశ్వసనీయము గాదు... ప్రాకారమునుండి పడమర మతంగాద్రి నెక్కుదుము కొంచె మెక్కుడు దిగుడులతో మనము పంపాపతి తేరువీథిఁ జేరుదుము.

అచ్యుతనారాయణదేవాలయమువద్దనుండి మరలి...వరహానంతశయనాలయముల వద్దనుండి తూర్పుగఁ బోవుదుము. కుడివైపునఁ జిన్న విష్ణ్వాలయ మున్నది. దీనినే జైనాలయమందురు...జైనాలయమనుటకు నిదర్శన మేమియుఁ గానరాదు. ఎడమ వైపున సుగ్రీవుని గుహ...సీత రావణాసురుఁడెత్తుకొనిపో...తనయాభరణాదులఁ జేలఁగునఁ గట్టి క్రిందంబడవైచినపుడు సుగ్రీవుఁ డీగుహాయందు దాఁచియుంచెనఁట. ఇచ్చటనే సీతాసరస్సను చిన్న కొలను గలదు.

రామాయణకథలతో సంబంధించిన యీస్థలముల దాఁటి తూర్పుదిశకు మరలఁగాఁ గేవలము మనుష్యప్రయత్నములు వారి పరాజయములతో సంబంధించిన కొన్ని శిథిలములయొద్దకు వచ్చెదము. దీనిని బండ్రాపురప్రతిబింబమనుట యుక్తమని నాకుఁ దోఁచెడిని. కృష్ణదేవరాయలు తనదేశములో నెంతధనకళాకౌశలము లుండెనో యంతయు వెచ్చించి యీదివ్యభవనము నిర్మించియుండును. కృష్ణదేవరాయఁడు పండ్రాపురవిఠలుఁ డిచ్చట వెలయుటకొఱకు గొప్పప్రయత్నముఁ జేసినట్లు చెప్పెడి యొక గాథ గలదు. విఠలుఁడు కృష్ణదేవరాయని మొఱ విడచెవిని బెట్టి యాతఁడు తనకై కట్టించిన దివ్యభవనముకన్నఁ దానుండెడి పేదగుడియే యుత్తమమని నుడివెనఁట...

ఉత్తరపుఁ జివర...చేరినాము. అచ్చటనుండి శిథిలమైన యొక వంతెనను జూడఁ గలము...చిన్నపండ్రాపుర మనఁజెల్లు నీస్థలము రెండంతస్తులమండపమునుండి...మఱికొంత దూరము పోఁగా...రాజులు ధనముతోఁ దాము తూఁగి బీదలకు దానముఁ జేసెడి... త్రాసొకటి గలదు...ఒక రాతిశిలవాకిలినుండి పోఁగా దేవాలయపుఁ బశ్చిమప్రాకారము ప్రవేశింతుము...

—♦ ఆకాశరామన్న గారు ♦—

ఈమహానుభావుఁడు జగద్విదితకీర్తి. భగవంతుఁడగు రాముని పేరఁ బిల్వఁబడు నీతఁడే చాటునుండియో రాళ్ళు విసరునట్లు...కార్యసాధక ప్రయత్నములు సలుపుచుండును. చెట్టుచాటున నుండి వాలిం గూలనేసిన రాముని చరిత్రమును స్మృతికిఁ దెచ్చుకొనిన యల్పమతులచే నితఁడా పేరునఁ బిలువఁబడియుండనోపు. వీరియింటిపే రాకాశమువారు. ఆకాశమనఁగా సర్వశూన్యప్రదేశము. కేవల మప్రత్యక్షవృత్తిగలవాని కీయింటిపేరు సమంజసమే. ఈమహాత్ముని యవతారములలో ముఖ్యములు మనుష్యావతారముఁ బత్రికావతారము. ఇం దీతఁడు సత్యవాదిభావమున నొకప్పుడును నసత్యవాదిభావమున నొకప్పుడును వెలువడుచుండును. అవాచ్యములగు వాక్కులును సందర్భరహితములగు వ్రాఁతలును... విజృంభించుచుండును... బయలుదేఱునపు డేమర్యాదయు లేకపోవుటచే వాని నగ్గిపుల్లగారో వేస్టుపేపరుబాస్కెటుగారో యాదరింతురు. ఒకప్పు డీతని మహిమము దిగంతములకు ముట్టపెట్టును. చిలిజగడము మొదలు ఘోరయుద్ధమువఱకును నవమానముం గల్పించు నీతనిశక్తి యుభయపక్షములందును నెంతయేని పనిసేయుచుండును. కామేశ్వరియుఁ గ్రోధేశ్వరియు నీర్ష్యాదేవియు నీతని చుట్టములు. వీరలకు జగన్నాథుఁ డెంతకాల మనుకూలుఁడో యాలోచనీయము.

ఔరా యాకాశవంశజా! నీవంశ మాకాశముగాను, నీవెంతటిమాయలమారివిరా? ఆలుమగల విడఁదీసి తల్లిబిడ్డలకుఁ దగనిజగడములఁ బెట్టి బందుగుల పొందులు భంగముగావింపఁ బ్రయత్నింతువు. పురుషోత్తముల కల్యాణకార్యములందును నీబుద్ధి పాపముపంకనే పాఱును. ఒకప్పుడు గృహస్థులయాశ్రమాంతరస్వీకారమునకుఁ గొంతవఱకు నిదానము నీవేయైయుందువు. నీమహిమ మవాచ్యము. నీ వావహించు మనుజుఁ డవివేకియైనచో క్షుద్రోపదేశబలంబున నీచేతి తోల్బొమ్మయై యెట్టియవమానములకైనఁ బాత్రుఁడగును. కలహప్రియులును నీర్ష్యాపరులును క్షమాదూరులును నౌ నల్పమతులు దక్క జాణ యెవ్వఁడు నీకు లోఁగును? ఎటులో చిరంజీవిత్వము నెఱపుచు ననంగరూపమున సంచరించు నీరూప మేనాఁడో రాజేశ్వరుని వేఁడికంటఁ బడకపోదు.

చదువరులారా !

సీ॥ కడు నందమౌ గొల్సుకట్టువ్రాఁతలఁ గొన్ని చేడెలదస్తూరితోడఁ గొన్ని
బాలురు బాలికల్ వ్రాయువ్రాఁతలఁ గొన్ని దాపలికేల్ వ్రాఁతఁ జూపు కొన్ని
ఆకాశరామన్నయనువ్రాలుతోఁ గొన్ని వ్రాలువర్జంబైనవానిఁ గొన్ని
కొన్ని యబద్ధముల్ గూరిచి వీనుల వినరాని దుర్భాషలను లిఖించి
కొన్ని పొన్నూరఁ గొన్నిఁటి నున్నయూర
పోస్టులో వేసి జగడాలు పొసఁగఁజేయ
పూని జాబులఁ బంపును జ్ఞానహీనుఁ
డగుచు నాకాశరామన్నయను ఖలుండు. (ఆంధ్ర)

తే. గీ. తనువు పేరిటి సప్తచ్ఛదంబునందు
నరపు కపురంబు వాడమినంతనె యెటింగి
మరణమనియెడు కూ్రరంపు మదపుటేన్గు
నిముసమున దాని నున్మూలితము నొనర్చు. 299

క. మరణ మహారాజేంద్రుం
డరుదేరఁగ మున్ను నడచు నాధివ్యాధ్యు
త్కరసేన పలితకేశ
స్ఫురిత ధవళచామరములు శోభిలుచుండన్. 300

చ. ఉరు కదనస్థలిన్ బరుల కోడని భూరిపరాక్రముల్ భయం
కర గిరిగహ్వరంబుఁ జొరఁగా వెనుదీయని ధీరమానసుల్
పరమమునీంద్ర! యిట్టి ముదిపాయము పేరిటి బక్కరక్కసిన్
గరము భయంకరమ్ముగను గన్గొనుచుందురు నిర్జితాత్ములై. 301

క. లలితాత్మ! మేనుగీమున
బలితపు వార్ధకపు టివము పడి యలముకొనన్
వలిగొని యింద్రియశిశువులు
చలియించుట కేనియును నశక్తులుసుమ్మా. 302

క. గురుకాసాధోమారుత
మురజధ్వను లుల్లసిల్ల ముదిమియనెడు దో
మ్మరిపడుచు మేనుగడపయిఁ
గరయష్టి ధరించి యాడుఁ గరము నరుదుగన్. 303

తే. గీ. గంధపూరితమగు మేనుకామచివర
నరలు కుంచియపగిది నందము వహింప
జరఠపురుషులు సంసారసార్వభౌము
కొలువుపీచోపులట్లు రాజిలుదు రనఘ! 304

క. జరయను చంద్రోదయమున
నరనుత! దేహాభిధాన నగరము వెలుఁగన్
జిరజీవితాశ పేరిటి
సరసిన్ మృతికైరవము వెసన్ వికసించున్. 305

తే. గీ. పెత్తనపువెల్లువఅపుచే విశదమైన
దేహమనియెడు శుద్ధాంతగేహమందు
ఆపదయు నార్తియు నశక్తి యనెడు మూఁగు
రంగనలు కాఁపురంబుందు రమలచరిత ! 306

ఉ. ఎందు మహోన్నతిం దనరు నిట్టి యసహ్యపు వృద్ధభావ మిం
కెందు భయంకరంబయిన మృత్యువు ముందు గమించుచుండు నిం
కెందు విపత్తులేలు నెపు, డిట్టిశరీరమునందు నూఱటం
బొందుట యెట్టు లింక మునిపుంగవ ! మందుఁడనైన నే నిలన్ ! 307

తే. గీ. ముదిమినందియు జీవించు బ్రదుకునందు
నాసవహియింపనేల? మూఢాత్ము లకట !
ఎట్టివారికి ముదిమి జయింపరాదు
ఎల్లయీషణములకంటె నిదియ హెచ్చు. 308

వ. అని నుడివి రామభద్రుండు వెండియు నిట్లనియె. 309

—♦ కాలవర్ణనము ♦—

ఆ. వె. అతివికల్పకల్పనానల్పజల్పలా
నల్పమతుల భేదకల్పనముల
భ్రమము విస్తరించి బ్రహ్మాండకుహరంబు
నిండియున్నయది యఖండతేజ ! 310

ఆ. వె. ఇట్టిభ్రాంతివలన నేర్పడ్డ జాలపం
జరము భవ మనంగ సంయమీంద్ర !
దీని కాసపడెదు దీనులు ముకురబిం
బితఫలంబుఁ గోరు వెఱ్ఱివారు. 311

వ. ఇదియునుంగాక 312

క. ఏవారికి సంసృతిసుఖభావన యొక్కింతగలుగు వారల యాసల్
వేవేగఁ ద్రుంచుఁ గాలము, కోవిద! తంతువుల నెలుక గొఱికెడిరీతిన్

క. అనఘాత్మ ! సకలఘస్మరుఁ
డనఁదగు నీకాలపురుషుఁ డవనిన్ గ్రసియిం

పనిదంచు నొకటి గల్గదు
వననిధిఁ గబళించు బాడబంబువిధానఁ 314

తే. గీ. అతిభయంకరుఁడైన కాలాభిధాన
ప్రళయరుద్రుండు దృశ్యప్రపంచమెల్ల
నెట్టిభేదంబుఁ జూపక యేకరీతి
మ్రింగ నుద్యుక్తుఁడై యుండు మిహిరతేజ! 315

తే. గీ. కబళితానంతవిశ్వుండు కాలదేవుఁ
డఖిలవిశ్వాత్మకుండయి యాహరింపఁ
బూని యెంతమహాత్ములకైన నిమిష
మాత్ర మవకాశ మొసఁగఁడు మాన్యచరిత! 316

క. యుగవత్సరకల్పాఖ్యము లగురూపంబుల నొకింత వ్యక్తాత్ముఁడనఁ
దగియు నలక్ష్యాకృతియై జగమెల్ల నితం డొనర్చు స్వవశముగాఁగన్.

క మేరుగిరిగౌరవాఢ్యులు చారుశరీరులు శుభప్రచారులు నగు స
త్పూరుషులు కాలగిళితాకారులయిరి గరుడభుక్త కద్రూజులటుల్.

చ. కఠినుఁడు నిర్దయాత్మకుఁడు కర్కశుఁడున్ గృపణుండుఁ గ్రూరుఁడున్
శఠుఁడగు కాలపూరుషుఁడు సర్వచరాచరభూతజాలమున్
జఠరమునం దిముడ్చుకొనసాగినఁ గాదని యడ్డువెట్టి త
ద్ధఠమును మాన్పఁగలయట్టిఁ డొకండును లేఁడు సంయమీ!

తే. గీ. కబళనైకాంతచిత్తుఁ డికాలపురుషుఁ
డద్రిసంఘాతములనైత మాహరించు.
అఖిలలోకమ్ములను మ్రింగియైనఁ దృప్తి
నందఁ డించుకయును నిమ్మహాశనుండు. 320

ఆ. వె. నటునిరీతి నితఁడు నానాకృతులను సం
సారనాటకమున సంచరించు
నొకెడ సంహరించు, నొక్కెడ సృజియించు,
నొకెడఁ గుడుచు, మఱియు నొకెడ నడఁచు. 321

తే. గీ. కాలమనియెడి చిలుక జగంబుపేరి
దాడిమఫలంబును బగిల్చి దానిలోని
భూతబీజావళులఁ గడుఁబ్రీతిమీఱ
విడివిడిగఁ దీసి గ్రసియించు విబుధవంద్య! 322

క. ఘనజనతాజీవ మహా
వనమున విహరించు కాలవారణ మెపుడున్
దనదు శుభాశుభరదముల
జనపల్లవములను ద్రుంచి సంరంభించున్. 323

తే. గీ. బ్రహ్మమూలంబులున్ దేవఫలములై త
నర్చు బ్రహ్మాండవృక్షసంతతులఁ గాలు
బ్రహ్మకాననమునయందుఁ బర్వి రాజ్య
మేలుచున్నాఁడు కాలుఁ డహీనతేజ! 324

తే. గీ. యామినీనామక భ్రమరాంచితములు
దివసపుష్పగుళుచ్ఛ సందీపితములు
నయిన వత్సరకల్ప కలాఖ్యవల్ల
రులను విసువక పెంచు నీయలఘుబలుఁడు. 325

తే. గీ. విఱువఁబడియు నొకించుక విఱిగిపోఁడు
తగులవేయంబడియు సుంత తగులఁబడఁడు
దృశ్యుఁడయ్యు నొకింత దర్శింపఁబడఁడు
మునివరా! యాతఁ డెంతటిమోసగాఁడు! 326

తే. గీ. తత మనోరాజ్యమట్లు విస్తృతి వహించి
మించు నిక్కాల మొక్కనిమేషమంద
యెద్దియైనను సృజియించు, నెద్దియైన
నిమిషమాత్రనె నాశమందించు మరల. 327

చ. ఘనతరదుర్విలాస జనకష్టసుపుష్టయునౌ స్వచేష్టయన్
వనితనుగూడి కాలగృహవల్లభుఁ డీతనువంద యాత్మభా
వనగల మూఢజీవులను స్వర్గమునన్ నరకంబునందుఁ దా
ననయము త్రిప్పుచున్ ముదమునందుచునుండు మునీడ్యవర్తనా!

క. సతతంబుఁ గుక్షిపూరణరతుఁడగు నీతండు తృణపరాగేంద్రవసు
క్షితిధరపర్ణార్ణవముల మితిలేక యభేదరీతి మ్రింగఁగడంగున్. 329

తే. గీ. కార్యమెల్ల నీతనియంద క్రాలుచుండు
లోభ మంతయు నీతనిలోన యుండు
చాపలంబెల్ల వీనియందే పొలుచును
అఖలదౌర్భాగ్యములు వీనియంద నిలుచు! 330

—♦ స త్య ము ♦—

శిశువు లాటలాడునపుడు చిన్న చిన్న చీమలు దోమలు నీఁగలు మొదలగు బాధాకరములగు జంతువులకును హానిచేయరాదని బోధించవలెను. ఇతర శిశువులకుఁగాని జంతువులకుఁగాని బాధాకరములగు పదార్థములతో బిడ్డల నాడుకొననీయరాదు. సుగుణపుంజము లన్నిటికిని దయాసత్యము లాలవాలములు. ఇది యెల్లరు నెఱిఁగియుండదఁగిన విషయము. ఆ రెండులక్షణములుకలవారి నెల్లసద్గుణములు నప్రయత్నముగ వర్తించి విడువకుండును. దయాసత్యములు లేనివారికి సుగుణసంపత్తి కలుగదు. కలిగిన నిలువదు. వేరుపెఱికిన వృక్షమువలెఁ గృశించి నశించును. సత్యమునకు మించిన తపము గాని వ్రతము గాని లేదని పూర్వకాలికమతకర్తలును జ్ఞానులును బోధించి యీవిషయమును గ్రంథములం బూరించియున్నారు. సత్యం మాతా యని ప్రసిద్ధవచనము కలదు. తల్లివంటి దాని నవలంబించినవారి నాదరణము సంరక్షణ మొనరించి సత్ప్రవర్తనామార్గముల నొనఁగూర్చి సుగుణపుంజములం జేర్చి యైహికాముష్మికసుఖముల సమకూర్చును. ఇంతకంటె నధికసంపత్తుల నొనఁగూర్చఁగల తల్లి మఱియెవరు? సత్యవంతులకు లోకమెల్లఁ దల్లియగును. లోకు లెల్లరు వారిం గన్నతల్లికంటె నధికానురాగముతోఁ గాపాడుచుందురు. తలిదండ్రు లసత్యముకలవారైనచో వారి పిల్లలు నట్టివారే యగుదురు. ఎప్పుడేని బిడ్డలతోఁ గాని యితరులతోఁ గాని వారొక యనృత మాడిన శిశువు లది కనిపెట్టి తాము నూఱంతలుగ ననృతములు నుడివెదరు. పిల్లలు తప్పొనరించినపుడు తండ్రి శిక్షించునని తలంచెడు తల్లులు దానినిమఱుఁగుపఱచి మఱియొకవిధముగఁ జెప్పి వారికి శిక్ష తప్పించుట సహజము. పసిపిల్ల లసత్యము లాడ నేర్చుట కిది యారంభదశ. నిజము చెప్పియే వారలు శిక్షితులు కాకుండఁ దప్పించవలెను. అది యసాధ్యమైనపుడు కల్లలాడి తప్పించుటకంటె వారికి శిక్ష కలిగించుటయే పరమోత్తమము. సత్యనియమమువలనఁ గలుగు జనగౌరవము విశ్వాసముఁ గీర్తియు నన్యవర్తనములచే లభించవు. అందువలన మనంబున కలుగు సుఖము వర్ణింప నెట్టికవీశ్వరునికిని నలవి కాదు. సత్యనియమముకలవారు త్రికాలవేదులుగ మనవారు నిశ్చయించియున్నారు. సత్యవ్రతముకలవారి నీశ్వరుఁడు వెంటనంటి కాపాడుచుండును. అట్టియీశ్వరసాన్నిధ్యముచేతనే లోకు లెల్లరు నట్టివారిం గనిపెట్టి కాపాడుచుందురు. సత్యవంతుల హృదయము నిర్మలమై ముఖము తేజోవంతమై యొప్పుచుండును. సత్యము నాలుగుపాదముల నడచుచుండును.

అసత్యము కుంటిదనియు వ్యాపనమందఁజాలదనియుఁ జీనాదేశీయులు చెప్పుచుందురు. వెండిబంగారుపూఁతపూసిన లోహాంతరపదార్థములు ప్రథమమునఁ జూడఁగనే వెండిబంగారువానివలెనే తోఁచినను వాడుటచే నఱిగి నిజరూపము వెల్వడునట్లు సత్యము పూఁతవేసి చెప్పిన యసత్యమును వెలి కుబుకుట సామాన్యము. నిజము వచించవలసినదని చిన్నవారికిఁ జెప్పినఁ జాలదు. ఆట్టికోరికకలవారు మార్గదర్శకులుగ నుండి తా మెపుడును సత్యమునే వచించుచుండవలెను. ఆపత్సమయములందును భయము వదలి నిజము చెప్పి వారు నట్లనుకరింపఁ బ్రోత్సాహపఱచవలెను. యథార్థవాదులై

మృతజీవులైనవారి చరితల నుడివి యానందము పుట్టించి వారిని సూనృతాభరణాలంకారుల నొనరించవలెను. నిజమాడెడివారికి సర్వకాలసౌఖ్యము లమరును. మృదుమధుర వాక్యముల వచియించువారికి లోకమెల్ల లోఁబడిపోవును. సత్యము వచియించుటలో వినువారికిఁ బ్రీతికరములగు మాటలుమాత్రము నుడువ నభ్యాసముకలవారికి మంచికలుగును. కాని యనృతములాడువారికిమాత్రము సర్వదా కష్టములే ప్రాప్తించుచుండును. నవ్వులాటకు బొంకువాని మాటలు నిజములైనపుడును లోకులు విశ్వసింపకుందురు. పులి పులియని కల్లలాడి హాస్యమొనరించిన గొల్లపిల్లవాఁడు నిజముగఁ బులివచ్చినప్పుడు నమ్మింపఁజాలక దానివాతఁబడిన కథ మన మెల్లరము నెఱిఁగినదే. ఇందుచేత నవ్వు హాస్యమునకైనను బొంకులాడరాదని నిశ్చయించఁదగియున్నది.

అమెరికాఖండమున నొక గొప్పవానికి వాషింగ్టనను నొక చిన్న కుమారుఁడుండెను. ఇతఁ డాడుకొనుటకుఁ దండ్రి యొక చిన్న గొడ్డలి చేయించియిచ్చెను. ఒకానొకదినమునఁ దమ యారామంబున విహరించుచు దూరదేశమునుండి తెప్పించి నాటించి ప్రాణపదముగఁ బెంచుచుండిన యంజూరపుమొక్క నీచిన్నవాఁడు తనచేతి గొడ్డలిచే నఱికివైచెను. అనంతర మాచిన్నవాని తండ్రి చెట్టునఱికియుండుట గాంచి మిగులఁ గోపమును విచారమును గలవాఁడై తోఁటమాలీలను విచారించుచుండెను. వారందఱుఁ దా మెఱుఁగమని చెప్పిరి. అంతటఁ దనకొమారు నడిగెను. తండ్రి శిక్షించునను భయమును విడిచి యాచెట్టు నేనే నఱికితిననియు నది నీకంత యప్రియమైనదనికాని యట్టిచెట్లు మఱికొన్ని లేవనికాని యెఱుఁగననియు వాషింగ్టను సంశయము మాని చెప్పెను. ఆమాటలు విని తండ్రి కోపమెల్ల దిగనాడి మిగుల సంతసముకలవాఁడై తన కిట్లు నిజముచెప్పు తనయుఁడుండిన నట్టి కల్పవృక్షముల నెన్నిటినైనఁ బడయఁగలనని చెప్పి యాచిన్నవాని నెత్తిముద్దాడి విడిచెను. అనంతర మాచిన్నవాఁడు మహోన్నతపదవి ననుభవించెను.

పసితనమునుండియు సత్యముచెప్పు నలవాటుకలవారు తలిదండ్రు లూహింపఁజాలని మహోన్నతపదవి నందఁగలరు. బిడ్డ లొకవేళఁ దప్పొనరించిన వారిచే నిజము చెప్పించి యట్లుచెప్పినందుకు సంతసించి యిఁక నట్లుచేయకుండునట్లు లాలనగఁ దెలియఁ బఱచి యొప్పించి సత్యమునుడువుటవలననే శిక్షింపక బుజ్జగించి వదలితిమని వారెఱిఁగియుండునట్లు బోధించవలెను. పిల్ల లేదేని యొకవిషయము చెప్పినపుడు సంశయించక నమ్ముచుండవలయును. ఎప్పుడేని వా రసత్యముచెప్పినట్లు ధ్రువపడిన నది వారికిఁ దెలిపి దానివలనఁ గాఁదగిన చిక్కుల వివరించి యనంతరము వారలు నిజమునే చెప్పుచున్నారని ధ్రువమగువఱకు నసత్యమాడినందుకు శిక్షయని వారికిఁ దోఁచునట్లు కొంతకాలము వారిమాటలు విశ్వసింపఁజాలమని నిర్ణయించి యంతవఱకును గనిపెట్టి మార్గమునకుఁ దీసికొనిరావలెను. తినుపదార్థముల నిచ్చునపు డున్నదంతయుఁ దమ కప్పుడే యిమ్మని శిశువులు మారాటముచేయుట తఱచు కలుగుచుండును. అందుకు భయపడి మనము కొంత దాఁచియుంచి యున్నదంతయు నిచ్చితిమని వారికిఁ దెల్పి తప్పించుకొనుటయుఁ గలదు. కాకి యెత్తుకొని పోయెననియు పెలుక నడిగి తెచ్చితిననియుఁ

చెప్పుటయుఁ గలదు. ఈమాటలవలన నప్పుడేకాని యనంతరమునఁగాని యసత్యము చెప్పితిమని పసివారు తెలిసికొని వారు నట్టికల్లలు పలుక సాహసించెదరు. కావునఁ దలిదండ్రు లట్లు పిల్లల కెపుడును చెప్పక నిజము చెప్పిరేని సమాధానపఱచుచుండవలెను. బూటకములు చెప్పి సమాధాయించుటకంటెఁ బిల్లల దండించుటగాని వారేడ్చిన నూరకుండుటగాని నూఱంతలు మేలు. పసిపిల్లల నవ్వించుటకుఁగాని సంతోషపఱచుటకుఁగాని యసత్యములఁ బలుకరాదు. నమ్మించి యొకపదార్థమును మఱియొకటిగఁ జెప్పి తినిపించరాదు. పిల్లలు మందు త్రావక మారాటము చేయుచున్నపుడు మంచినీరని త్రావించుట బొత్తిగాఁ దగనిపని.

వేణిబాయి కొకసారి జబ్బుచేసెను. వైద్యుఁడు చేఁదుమందిచ్చుచుండెను. మందు త్రావవలసినపుడెల్ల నాచిన్నది వ్యవధిచేయుచుండెను. అట్టితఱి నొకతూరి దాహమడిగెను. సమీపమున నున్న యాప్తబంధు వొకఁడు విని యది మందిచ్చుసమయమైనందున నాచిన్నదాని మందును మంచినీరుద్రావుపాత్రయందుఁ బోసి యిచ్చెను. ఆచిన్నకన్నియ యది మంచినీరని తలంచి సంశయింపక వెంటనే త్రావెను. చేఁదగుటచే మంచినీరుకు బదులుగాఁ దన కాయన మందిచ్చెనని తెలిసికొని నన్ను మోసపుచ్చితివనియు నిఁక నిన్ను నమ్మననియు నీ వేమియిచ్చినను ద్రావననియుఁ జెప్పెను. కావునఁ బసివారి కెపుడును నిజము చెప్పి యొప్పించుచుండుటే పరమావశ్యకము.

ఒకానొక బాలుఁడు తనతల్లి కొక యసత్యము చెప్పెను. ఆతల్లి విచారమునంది నలువది దీనారము లిచ్చి నిజము చెప్పి బ్రదుకుమని తనయింట నుంచుకొనక దేశము మీఁదఁ బంపెను. మార్గమధ్యమున వానిని దొంగ లడ్డగించిరి. తోడనే యాచిన్నవాఁడు నావద్ద నలువది దీనారము లున్నవనియు నివి దీసికొని నన్ను వదలివేయుఁడనియు నడిగెను. దొంగలు వానిఁ బరికించి చూచి నిజము చెప్పెనని వింతపడి కరుణించి ద్రవ్యము నపహరింపక వదలివేసిరి. సత్యనియమము లోకమునెల్ల వశీకరణమొనర్పఁగలదనుట కిది యొక గొప్పనిదర్శనము.

ఒకయూర నొక ముదుసలి తనకూఁతురుకుటుంబమువారిచేఁ బోషింపఁబడుచుండెను. ఈమె నాదరించు సమీపబంధువు లౌరు లెవ్వరును లేరు. ఈకుటుంబమెల్ల సంవత్సరమునకు సహస్రాధికద్రవ్యము రాఁగల యీముదుసలి వృత్తిచే జీవించుచుండిరి. ఈమెకాల మాసన్నమగునని తలంచి దాయాదు లనంతరపు వారసత్వము స్థిరపఱచుకొనవలెనని యభియోగము తెచ్చిరి. ఈమె భర్తయుఁ గొమారుఁడును నేఁబదిసం॥లకు మున్నే గతించియుండినందున నభియోగము తెచ్చినవారికి విషయమెఱిఁగిన సాక్షులు లభింపక ముదుసలిసాక్ష్యము నే నమ్మియుండిరి. ఈమెకూఁతురుకుటుంబమువారి కిదితప్ప నేజీవనాధారమును లేదు. ఈమె నొక డోలికపై న్యాయస్థానమునకుఁ గొనివచ్చిరి.

న్యాయవాది:- నీభర్తయుఁ బుత్రుఁడును బోయి యెంతకాలమైనది ?

అవ్వ:- నాకూతు రేడాదిపిల్లయైయుండఁగనే పోయిరి. దీని కిపుడేఁబదియేండ్లు దాఁటినవి.

న్యా:- నీ పతిసుతు లెంత కాలవ్యవధిగ మరణించిరి ?

అవ్వ:- మా కావిపత్తు లొకదినముననే కలిగినవి.

న్యా:- ముం దెవరు పోయిరో జ్ఞాపకమున్నదా ?

అ:- ఇటువంటిసంగతులు మఱపునకువచ్చునా? అయ్యా! సూర్యోదయమునఁ దండ్రియు సాయంకాలమునఁ గొమారుఁడును.

ఈమాటలు వినఁగనే న్యాయాధిపతిమొదలగు సభికులెల్లరును విస్మయపడిరి. కూఁతురుకుటుంబమువా రెల్ల గొల్లుమని యేడ్చి యీమెకు మతిభ్రమ కలిగినదని చెప్పుకొనిరి. అభియోగము తెచ్చినవారు సంతోషాక్రాంతులై యుండిరి.

న్యా:- (ముసలమ్మవంకఁ దిరిగి నిశ్శబ్దముగ నుండున ట్లావరించి) నీవిపుడు చెప్పినసంగతి చక్కఁగ జ్ఞాపకముంచుకొని యెఱిఁగి చెప్పితివా ?

అ:- అయ్యా! నాకుఁ జక్కఁగ జ్ఞాపకమున్నది. ఈ నామాటలవలన నాయాస్తి యెల్ల నాభావసంతతివారికిఁ జెందుననియు నా యనంతరము నాకూఁతురుకుటుంబమువా రెల్లరు నిరాధారు లగుదురనియు నెఱుఁగుదును. కాని శాస్త్రనిషిద్ధజీవనముచే నా దౌహిత్రకుటుంబము వర్ధిల్లఁజాలదని నిజము చెప్పితిని. వారలు బీదలై యడుగుకొని బ్రతికినను వృద్ధికాఁగలరని నమ్మి నిజము చెప్పితి.

ఈనిశ్చయాభిప్రాయమున కెల్లరు నాశ్చర్యపడి వాదుల నొప్పించి యీమె యనంతరము సగమాస్తి కూఁతురుకుటుంబమువారి కిచ్చున ట్లొడఁబఱచి రాజీ తీరుమాన మిప్పించిరి. చూచితిరా? తనకూఁతురు పోరును దత్కుటుంబము వారి బలాత్కారమును ముసలమ్మచే నసత్యమాడింపఁజాలినవి కావు. సత్యవాఙ్నియమముకలవా రెట్టికష్టములనైన నోర్చి తమనియమము గాపాడుకొనఁగలరు.

ఋజువర్తనముకలవారికిఁ దెలివియు సామర్థ్యముఁ జుఱుకుతనముఁ దోడ్పడి తేజోభివృద్ధు లమరుచుండును. పుణ్యాత్ములగువారలకుఁగాని ఋజువర్తన మలవడదు. దానికిమించిన తపోవ్రతనియమములు లేవు. సర్వమతసారము నిదియేయని చెప్పనగును. లోకహితార్థులై బహుజనోపకారి సత్కార్యాచరణతత్పరత్వము కలవారే పుణ్యాత్ములు. ఏపదార్థమునందును నిశ్చయముగ గుణము కలదేని దానిని వెల్లడించుటకుఁ బ్రకటన లనవసరము. అట్టిగుణము గ్రహించినవా రెల్లరును దద్దాసులవలె దాని ఋజుభావమును జాటుచుందురు. సత్యవృత్తికలవారిని మనోరథసిద్ధి వరించును. అసత్యవర్తనముచే దారిద్ర్యము నవమానము నిరాశయుఁ గష్టమును సంప్రాప్తమగుచుఁ దుద కకాలమరణమును సంభవించును.

—♦ శంకరాచార్యచరిత్ర ప్రారంభము ♦—

శ్లో॥ పశ్చాచ్ఛంకరభగవత్పాద ప్రాదుర్భావోఽభవ ద్భూమ్యాం,
దుశ్చరితసంజ్ఞతమసో ద్యుమణిః ప్రమథాధిపావతారోఽయం. 21
యజ్ఞాది వైదికం కర్మాజ్ఞై ర్నాచర్యతే భువీహేతి
యజ్ఞభుగ్భి ర్దీనం యజ్ఞధ్వంసిన ముపేత్య విజ్ఞప్తం. 22
అథ వైదిక ముద్ధర్తుం హ్యాత్మని మత్వాగ్రి ఇంద్రసేనాన్యా
పృథివీకృతావతారౌ భూయాస్తామితి స చోదయామాస. 23
అవతేరతు స్తదా తౌ హరసుత వాస్తోష్పతీ ఘనాన్వయయోః,
భువి భట్టపాదసంజ్ఞో భూ దేకోఽన్య స్సుధన్వనామాచ. 24
దేవ స్స్వయమపి భూమీదేవశ్రేష్ఠస్య శివగురో స్సత్యాం
ఆవిర్బభూవ ధరణౌ, వయమే వార్య స్స శంకరాచార్యః. 25
విభునాదిష్టా మహ్యాం విధివిద్వహిరాజముఖ సురశ్రేష్ఠాః
ప్రభవం చక్రూ రభసం, ప్రథితా స్తే మండనాదిసంజ్ఞాభిః. 26
గురుకులవాసం కృత్వా క్రోధమదాదీ నరీ నరం జిత్వా
పరిచితసుకలో భూత్వా బభ్రాజార్య స్స శంకరాచార్యః. 27
శ్రుతిపఠనకాల ఏవ స్తుతిభి స్సంతోష్య తన్మహాలక్ష్మిం
క్షితిసురనార్యాః కస్యాశ్చి ద్భవనేయం వవర్ష సౌవర్ణం. 28
అష్టమహాయనవహా స్సేష్ట స్సన్యాసఆశ్రమ, స్తత్తు
కష్టమితి మన్యమానానిష్టం ప్రకటీచకార తన్మాతా. 29
గ్రీష్మఋతౌ తన్మాతరి కృచ్ఛ్రముభావ్యైవ నిమ్నగాం గత్వా
ఊష్మాసహమానాయా ముటజాంతికమేష తాం నదీ మనయత్. 30
నద్యా మస్యాం పశ్చా న్నక్రగ్రస్త స్స ఏకదాఽకస్మాత్
ఉద్యద్బాధావశతోఽహో జనయిత్రీతి రోదనం చక్రే. 31
గేహగతా సా శ్రుత్వా కృచ్ఛ్రం గత్వాచ తన్నదీతీరం
హేహర ! పాహి సుతం ద్రా గేకో హ్యాయమేవ మఇతి విలలాప.
మకరేణ పీడ్యమానో మాత!స్సన్యాస మనుగ్రహాణ త్వం
స కుజంతు రివృశం మాం సస్య స్తంవా విమోక్ష్యతీ త్యభణత్. 33

అథ తం జగాద మాతా, యదిజీవిష్యసి గృహాణ సన్న్యాసం,
వధత స్తదేవ కించి ద్వర, మభవిష్య త్సుతానసేఽహావా. 34
శ్రీమత స్స్వమాతు రాజ్ఞాం సంగృహ్యైవం స శంకరాచార్యః
క్రమసన్న్యాసం ప్రాప్తుం గతవాన్ గోవిందయోగిసాన్నిధ్యం. 35
గత్వా తదాశ్రమగుహాం కాంక్షితకార్యస్య వివరణం కృత్వా
నత్వా తస్మా ద్ధృతసన్న్యాసశ్చాభూ త్స శంకరాచార్యః. 36
గురునికటేఽస్మి న్నివసతి ఘోరో వర్ష ర్తు రాగత, స్తస్మిన్
సరితః పరిపూర్ణజలా స్తర్తు మశక్యాశ్చ భూయసాఽప్రవహన్. 37
సమాధినిష్ఠే స్వగురౌ తమాశ్రమం చంద్రజా సమాశ్రియత్,
నిమజ్జయంతీం సరితం కమండలౌ రాచకర్ష సహి శిష్యః. 38
ఉపరమితసమాధిం గురు ముపగతసంతోషవార్ధి మామంత్ర్య
స పరివ్రాట్కాశీంప్రతి సపది ప్రతస్థే ఖమార్గగమనేన. 39
అస్మాదథ విబుధధునీ మనవద్యానేక గద్యపద్యైశ్చ
ధ్వస్తసమస్తాఘచయాం దాశార్హపదోద్భవాం స తాం గంగాం. 40
త్రిస్రోతసి త్రిసంధ్యం దేహం సంశుద్ధ్య తంచ విశ్వేశం
శుశ్రూషయ న్ననైషీ త్స్వాస్యాం కాశ్యాంతు కతిపయాన్ దివసాన్
సహశిష్యై ర్భీష్మసువం శంకరగురురాజి గచ్ఛతి స్నాతుం
బహుగర్హ్యవేషధారీ ప్రాంతం పుల్కస ఉపాగతో జాతు. 42
పుల్కస! దూరం వ్రజరే, బుద్ధివిహీనఃకి మంతగోసీతి
కల్కఇవ భర్త్స్యమానోఽకథయ త్తం శంకరం స చండాలః. 43
చండాలదేహ ఏకో త్మ్మమరదేహోఽ పరోఽస్తి కిము వాత్మా ?
చండాంశోః ప్రతిఫలతే సరిదుదకే రాసు కిం ద్విధా బింబః ! 44
ఇతి దత్తప్రతివచనో యతికులవర్యం స శంకరాచార్యం
క్షితిభృత్సుతాపతి స్స్వం సేవ్యం రూపం ప్రదర్శయామాస. 45
యతివర! కురుష్వ భాష్యం వ్యాసకృతానా మశేషసూత్రాణాం,
ఇతి కృతశాసన ఆరా దియయాంతర్ధాన మేషు పశ్యత్సు. 46
జగదిద మాత్మతయైవ విజానన్ పురుషో ద్విజ శ్శ్వపాకోవా
స గురు ర్భవతి మమేతి స శంకరగురు రాత్మనిశ్చయం కృతవాన్. 47

ఏవ మనుజ్ఞాతో విశ్వేశేనార్య స్స శంకరాచార్యః
పావనబదరీం గతవాన్ భాష్యచికీర్షు స్సశిష్యపరివారః. 48
అథ భాష్యచంద్ర ఉదితో యతివరసింధో ర్దదన్ సుధాం సద్భ్యః
పృథుగోహృత విమతతమా ద్విజహృదయచకోర తుష్టికృచ్ఛాసీత్.
శిష్యైః స్సనందనాద్యై ర్భాష్య మపాఠయ దథాయ మాచార్యః,
ప్రేష్యత్వధర్మనిరతా శ్శిష్యాస్స ర్వేఽపహాంశ్చ ప్రాముఖ్యం. 50
సురసరి దపరతటగతో గురుణాహూత స్సనందన శ్శిష్యః
తరణిం వినాఽతర త్తచ్చరణసరోజాతసంతతధ్యానాత్. 51
పదిపది పద్మప్రభవే పదయుగళం తత్ర సోఽథ విన్యస్య
పద మభజ త్స్వయగురోః, బభాష తం పద్మపాదఇతి సగురుః. 52
తాదృక్శిష్యైర్గత్వా ధరణీసంవ్యాప్తదుర్మతస్థాంశ్చ
వాదోపవాదనిచయై ర్వశ్యంకృతవాన్ స శంకరాచార్యః. 53
అఖిలాన్ జిత్వా విమతా నద్వైతస్థాపనం చికీర్షుస్సన్ -
సఖినం సభట్టపాదం సంద్రష్టుమనా బభూవ యతిరాజః. 54

ఎంచుచో నేఁబదినాలుగే కాని యీయార్య లాయార్యు నద్వైతమతస్థాపనాంత చరిత్ర మతిసంగ్రహముగా నవగతము చేయుచున్నయవి. ఇఁక శంకరవిజయాంధ్రీకరణమును జదువరుల యెదుటఁ బెట్టుచున్నవాఁడను. మూలకర్తయగు మాధవాచార్యులును నాలాగుననే బాలిశాశ్రియమును బహుధా తెగడియున్నవారు. కృత్యాదిపద్యము గాక తక్కిన వన్నియుఁ దదాచార్యభావపూరితము లయియే తనరెడిని.

శా. శ్రీకంఠాంశమునన్ జనించి ధరణిన్ శిష్టత్వముం గాంచి య
త్యాకారంబు భజించి పెంచి నిజధీ నద్వైతమే యుంచి చా
ర్వాకుల్ బౌద్ధులు లోనుగాఁగల యసద్వాదౌఘమున్ వంచి సు
శ్లోకుండైతగు శంకరార్యునకు నాజోహారు లర్పించెదన్. 1

చం. అతిరుచిగల్గినట్టి మధురాతిరసాల్ భుజియించుపట్ల ను
న్నతులును నూరుఁబిండి యట నంజుకొనన్ మతివెట్టుచుందు, ర
ట్లతులితులైన పూర్వకవు లల్లినపద్యములం బఠించుచో
హితమగుఁగాక పండితుల కే రచియించిన పద్యముంబులన్. 2

చం. స్థిర మను భాష్యకారుఁడు ప్రసిద్ధకవీశులచేత సంస్తుతుం
డపయఁగ. ఔనుగాక. ముదమందెడు నా కృతిచేతఁగూడఁ దా.

నిరతము దుగ్ధవారినిధి నిల్చెడి శ్రీహరి పేరిమి గోపికా
తరుణు లొసంగు దుగ్ధములఁ ద్రావుటకున్ మది నిచ్చగింపఁడే! 3

ఉ. కొంచెపు నీదుకైతమున గొప్పప్రమోదముఁ జెందుటెట్టులో
నంచు వచించుఁగాక జన, మాప్తమనోరథుఁ డౌటచేతఁ దా
నించుకయైనఁగాని కర మెక్కువభక్తి నొసంగు వస్తువున్
మించినకూర్మి నీశ్వరుఁడు మేరుసమంబుగఁ గొంచుఁ బ్రీతుఁడౌ 4

కం. కొండంతదేవరకునుం గొండంతటిపత్రివెట్టి కొలువఁగవశమే
దండిజనునకును దులసీఖండముననె తృప్తిసేయఁగావలెఁగానీ. 5

ఉ. క్షీరతరంగిణీమథనసిద్ధసుధాసమమైన స్వీయవా
గ్ధార నహీంద్రు గెల్వఁగల తద్యతినాథుని స్వచ్ఛకీర్తియున్
నీరమునందు ముంచి కడు నేర్పునఁ బంకవిశిష్టమైన మ
త్ప్రాక్కరమనంబునుం గడుగఁ గోర్కి జనించె నదేమి యానొకో! 6

చం. భువిని వసంతకాలమునఁ బూచెడి జాజి గులాబిఁ దొట్టి మేల్
పువుల సువాసనల్ గలిగి పొల్చుచు దిక్కుల కెక్కినట్టి శ్రీ
శివగురుపుత్రు శంకరుని శ్రేష్ఠగుణావళి యేడ? ఏడ నే?
నవిరళ గుర్వనుగ్రహమె యారయ నన్ను సమర్థుఁ జేసెనే. 7

సీ. గొడ్రాలికొమరుతోఁ గుందేటికొమ్ముతో
తులితంబులైనట్టి ధూర్తనృపుల
శౌర్య మౌదార్యంబు ధైర్యంబు దయ యోరు
పాదిగాఁగలిగినయధిగుణముల
అభివర్ణనంబుచే నధికదుర్వాసనా
వాసితంబగు నాదువాక్కు నిపుడు
రహి ముజ్జగంబు లన్ రంగస్థలంబున
ఆడుచుం బాడుచు హర్షమునను
వర్తిలెడి శంకరాచార్య కీర్తి యనెడి
ఆటచేడియ మెయినుండి యవనిమీఁద
రాలినటువంటి చందనరజములోన
దాఁచి యొనరించెదను సుగంధవతిగాఁగ. 8

సహాయులు

౧ మెదక్ కిషన్ రావు దేశముఖుగారు, నల్లపల్లి.
౨ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౩ తిప్పరాజు కామేశ్వర రావుగారు, కరణము, దుగ్గిరాల.
౪ తిరుమలనల్లాన్ చక్రవర్తివరదాచార్యుల అయ్యవార్లంగారు,
శాతాపురము.
౫ రామమూర్తి జెండేరావుగారు, అయినపురము.
౬ రాజా మంత్రిప్రెగడ రాఘవరావుగారు - లింగగిరి.
౭ చిక్కరాజు మట్టపల్లిరావుగారు - చెలకుర్తి.
౮ నాదరగుల్ సంగమేశ్వరరావు దే॥ గారు శ్రీశ్రీ జగద్గురు
పుష్పగిరి సంస్థానపు ఏజంటు.
౯ అద్దంకి ... తిరువేంగడతాత దేశికాచార్యులయ్యవార్లంగారు.
తక్కెళ్ళపాడు.
౧౦ మియ్యాపురం రామకృష్ణారావుగారు, కొల్లాపురం.
౧౧ మల్లాది నరసింహమూర్తిగారు, ప్లీడరు, గురజాల.
౧౨ కురికాల వెంకటేశ్వరరావు దేశముఖుగారు, పులిగెళ్ళ.
౧౩ రాజా మంత్రిప్రగడ వెంకటహనుమంతరావుగారు, లింగగిరి.
౧౪ జింకా వెంకటసుబ్బారావుగారు, వకీలు, గురజాల.
౧౫ వద్దిరాజు సత్యనారాయణరావు దేశపాండ్యాగారు, మేడిపల్లి
౧౬ గొట్టిపర్తి సుబ్బారావుగారు, వకీలు, సింగరేణికాలరీసు.
౧౭ మారేపల్లి వెంకటకిషన్ రావు, మాధవరావు దేశముఖుగార్లు
కాకర్లపల్లి.
౧౮ దంటు లక్ష్మీనరసింహముగారు - సుద్దపల్లి.
౧౯ మద్దూరి సాంబయ్యగారు - బొగారుకంపెని - పల్లుమాను.
౨౦ ముద్దు చంద్రయ్య, మారేపల్లి మాధవరావు దేశముఖుగార్లు
కొత్తపల్లి.
౨౧ రాయప్రోలు సుబ్బారావుగారు, ప్రొఫెసర్,
యూనివర్సిటీ కాలేజి, హైదరాబాదు.
౨౨ పెసర వెంకటరెడ్డి దేశముఖుగారు, పుల్లారెడ్డిపల్లె.
౨౩ గడ్డం వెంకటనరసింహారెడ్డి దేశముఖుగారు, చెలుకుపల్లి.

అభినవసరస్వతి

సంపాదకుఁడు - నాగరఖండస్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది యొకమాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనములును వ్యాసములును ప్రకటింపఁబడును. చందా సం॥ 1 కి రు 3-0-0

ఈ కార్యస్థానమున వెలకు దొరకు పుస్తకములు.

1	విరూపాక్షపీఠగురుపరంపర ...	0	2	0
2	నీతిగీతలు (సుమతిశతకము, ధ్వానిశ్లోకములు) ...	0	2	0
3	వాసంతికాపరిణయ నాటకము ...	0	4	0
4	కరిణీకోద్ధారిణి [ప్రాచీనప్రబంధము] ...	0	4	0
5	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము	0	2	0
6	వత్సలనీతిశతకము ...	0	1	0
7	నర్సారావుపేట శతావధానము (తిరుపతివేంకటీయము)	0	3	0
8	సంగదోషము ...	0	3	0
9	వైశ్యశబ్దవిచారము ...	0	2	0
10	పురశ్చరణము ...	0	2	0
11	విగ్రహారాధన ఖండనఖండనము ...	0	4	0
12	స్వర్ణకారవ్యవహారము ...	1	8	0
13	శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము ...	0	10	0
14	సూతసంహిత (ఆంధ్రము) ...	2	0	0
15	భారతీయప్రబోధము (పిసుపాటి చిదంబరశాస్త్రి)	0	4	0
16	ధర్మనిర్ణయము ...	0	4	0
17	అస్పృశ్యతానివారణఖండనము (మల్లాది రామకృష్ణచయనులు గారు)	0	8	0
18	స్కాందమహాపురాణాంతర్గత నాగరఖండము (౧ సంపుటము)	1	0	0
19	డిటో నాగరఖండము (౨ సంపుటము)	1	8	0
20	డిటో నాగరఖండము (౩ సంపుటము)	1	8	0
21	డిటో నాగరఖండము (౪ సంపుటము)	1	8	0
22	పల్నాటివీరచరిత్ర	0	12	0
23	ఆరోగ్యభాస్కరము	0	6	0
24	భాగవతరహస్యములు	0	4	0
25	సోమేశ్వరశతకము	0	2	0
26	జాతకచర్య (స్వకీయులచరిత్ర)	1	8	0

అభినవసరస్వతి కార్యస్థానము, జానపాడు, పిడుగురాళ్లపోస్టు,
గుంటూరు జిల్లా.